కచ్చితమైన జవాబు

పండిత శ్రీపాద
సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

౧

"ఎక్కణ్ణుంచిరా సీతారామయ్యబావా" అంటే "ఎందాకానురా జానకిరామయ్యబావా" అని చామర్లకోట రైల్వే ప్లాటుఫారమ్మీద మేనత్త మేనమామ బిడ్డలిద్దరూ వొక్కమాటే పలకరించుకున్నారు. ఇద్దరూ కూడా బెజవాడ నుంచి వచ్చిన బండే దిగినా, దిగీదాకా మాత్రం వొకర్ని వొకరు చూసుకోలేదు. ఆచూసుకోవడంలో కూడా యిద్దరూ వొక్క మాటే చూసుకున్నారు. తరవాత లైసెన్సుకూలీచేత సామాను పట్టించుకొని వెళ్లి కాకినాడ సూప్లికేటులో యిద్దరూ వొక్క గదిలోనే కూచున్నారు. కూచునీ లోపల కుశలప్రశ్నాదికం అంతా అయిపోయింది.

సీతారామయ్యది క్రాపింగూ, కుచ్చు మీసాలూనూ. జానకిరామయ్యది యిసలా. అతను మీసాలువుంచుకోడానికి పితామహుడు వొప్పుకోలేదు. తక్కిన వేషం అంతా—అంటే బిళ్ళగోచీలూ, నెక్టయిలూ, వేస్టుకోట్లూ, రిస్టువాచీలూ, బూటులూ, కళ్లకద్దాలూ—అంతా సమానమే. కానైతే సీతారామయ్య కొంచెం పొడుగూ, చామనచాయానూ. జానకిరామయ్య కొంచెం పొట్టీ, దబ్బపండు లాంటి పచ్చనానూ.

సీతారామయ్య సిగరుట్టి తియ్యగా జానకిరామయ్య కారాకిల్లీ తీశాడు. ఇద్దరూ కూడా మంచి అడావుడిలో వున్న సమయంలో అనాఘ్రాతపుష్పం లాంటి వొక బాలవితంతువు దగ్గిరనుంచి చకచకా నడిచి పోయి పక్క గదిలో కూచుంది. సీతారామయ్య చూపులు మెరసిపోతూ అలా తిరగ్గా జానకిరామయ్య "యిలా చూడూ" అన్నాడు.

"వొరేయి! మహా చెడ్డ పని తలపెట్టావని తెలిసిందిరా, నిజమో అబద్ధమో గానీ. చిన్నప్పణ్ణుంచీ మా యింట్లో పెరగడంచేత నీ తత్వం తెలుసును కనక నీకిలాంటి బుద్ధులు పుడతాయని మేమెవళ్లమూ యెప్పుడూ అనుకోలేదు. వెధవముండని పెళ్లాడాలని ప్రయత్నిస్తున్నావుట యేమిటిరా నువ్వూ? ఇటు నాటకొంతం సంస్కృతమూ, అటు బి. యే. దాకా యింగ్లీషూ చదవడంచేత వచ్చిన తెలివితేటలా యేమిటివి? నువ్వాపని చేశావంటే నీ పూర్వులు స్వర్గభ్రష్టులు కావడం అలా వుండగా, యిక మీ యమ్మ గోల చెప్పతర మౌతుందా? పోనీ మంచీ, చెడ్డా యేర్పరించుకో తగ్గ ప్రతిభ లేనివాడవేమో అంటే, ముప్ఫయ్యేళ్లు ఖరాగా నిండడమే కాకుండా, మంచి విమర్శకుడవని పేరు కూడా పొందావు. కొంచెం నిదానించావంటే నువ్వు ప్రయోజకుడవు కూడా అయినావు కనక, యే పిల్ల జమీందారైనా పది పన్నెండు వేల కట్నంతో బతిమాలి పిల్లనిస్తాడు; కాని నీకు మళ్లీ పెళ్లి కాదని భయమా? కృష్ణుడు తరవాత మన బ్రహ్మగాళ్లలో అంత చక్కనివాడవు; నీ కందమైన కన్యలు దొరకరా? నీకీ దుర్బుద్ధి యెలా పుట్టిందో కాని యీ పాటికి మళ్లించుకో. తాతయ్య వింటే గోలపెడతాడు. నాయనమ్మకి తెలిసిందంటే యిక చెప్పనా? చివరికి

పెద్ద గందరగోళం పుడుతుంది. నా మాట విని యీపాటికి మంచి దారికి రా"అని జానకిరామయ్య చెప్పగా సీతారామయ్య చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

ఈ మందహాసం జానకిరామయ్యకి వుద్రేకం కలిగించింది. "నువ్వే మహా తెలివైన వాడ వనుకోకు; నీ తల మీద యెగిరిపోయీ వాళ్లు లోకంలో లక్షలున్నారు. విధురుడు వితంతువుని పెళ్లాడ్డంలో కొంచెం చమత్కారం వున్నా, కాస్త పస్తాయించి చూసుకుంటే అందులో వున్న అవకతవకలు నీకే తెలుస్తాయి. అనేకాలు చూశా నాభాసదాంపత్యాలు నేను. అందులో నువ్వు కూడా చేరిపోవడం నా కిష్టం లేదు. ఆడదానికి వైధవ్యం వస్తే ఐహిక వాంఛల్ని తెగ తెంచుకోవడంలోనే వుంది ప్రశంస. అలా తెంచుకో లేనిదాన్ని పెళ్లాడ్డం–రేఁమి చెప్పనూ? ఇంతకీ మంచి వంశంలో పుట్టి, మంచి సాంప్రదాయాల్లో పెరిగిన పణమైన వితంతువు మా చెల్లెల్లాగ వైరాగ్యంతో కాలం గడిపేస్తుంది; కాని పునర్వివాహానికి సిద్ధపడుతుందా?" అని అతను కొంచెం దురుసుగా అడిగాడు.

సరిగా ఆసమయానికే బండి కదిలింది. ధ్వని అంత కంతకి హెచ్చింది. "మాటలు బాగా వినపడడం లే"దంటూ సీతారామయ్య వూరుకో మన్నాడు; కాని "వినిపించుకోవా లంటే వినపడక యేం చేస్తుం"దంటూ జానకిరామయ్య ధోరణి తగ్గించ లేదు. దాని మీద అతను మందహాసం చేస్తూ మొగం పక్కకి తిప్పుకున్నాడు.

మరి పది నిమిషాలికి బండి కాకినాడ టౌన్ స్టేషన్లో ఆగింది. ఆగీ ఆగడంతోనే సీతారామయ్య దిగి కూలీచేత సామాను తీయిస్తూ వుండగా పక్క పెట్టిలో వున్న వితంతుయువతి దిగింది. అతని చూపంతా అటే వుంది. వొక యువకుడు వచ్చి ఆమె కింగ్లీషులో స్వాగతం యిచ్చాడు. ఇద్దరూ హస్తచాలనం చేసుకుని యింగ్లీషులో మాట్లాడుకుంటూ విలాసంగా నడిచిపోయి మోటా రెక్కారు. చూస్తూ వుండగానే మోటారు భూంయి మంటూ వెళ్లిపోయింది.

ఇదంతా చూశాటప్పటికి సీతారామయ్య మొగమ్మీద అసంతృప్తిలక్షణాలు పొటమరించాయి. కళ్లల్లోనుంచి నిశితదృష్టులు పుంఖానుపుంఖాలుగా దూసుకుపోయాయి. ఇదంతా చూసి జానకిరామయ్య "ఆవిడేనా యేమిటి పెళ్లికూతురు?" అన్నాడు. దానితో సీతారామయ్యకి మెరుపుదెబ్బ తగిలినట్లయింది. "వొరేయి! నువ్వు మంచీ, చెడ్డా చూడవురా. లేనిపోని వన్నీ కల్పించి, చూస్తూ వుండగా పెంచెయ్యడంలో నీయంతవాడు లేడు. వితంతువివాహానికి సిద్ధపడితే మాత్రం ఆదొరసాని యెవరి క్కావాలీ?" అని అతను కొంచెం చురుగ్గా జవా బిచ్చాడు.

జానకిరామయ్య మొగం పక్కకి తిప్పుకుని నవ్వుకోగా సీతారామయ్యధోరణి మార్చెయ్యాలని వూహించి, "యింతకీ నువ్వెందుకు వస్తున్నావోయి?" అన్నాడు.

"పూర్ణ యిక్కడే వుంది."

"ఎందుకు వచ్చిందీ?"

"వదినగారిని చూడడానికి."

"ఏం కథా? పిల్లల తండ్రి వౌతావా యేఁమిటిరా నువ్వూ?" ఇందుకు జవాబు చెప్పక జానకిరామయ్య మందహాసం చెయ్యగా, "అయితే నేనూ అక్కడికే వస్తాను పద" అని సీతారామయ్య చెప్పాడు. ఇద్దరూ జట్కా యెక్కి వేళాకోళాలు చేసుకుంటూ వెళ్లిపోయారు.

౨

వర్ధనమ్మా, పూర్ణా జానకిరామయ్య యివాళో రేపో వస్తాడని నాలుగు రోజులనుంచి యెదురు తెన్నులు చూస్తూవున్నారు. వర్ధనమ్మకి మూడో నెల దాటింది. ఆమె తల్లి యీ సంగతి చూచాయగా రాయగా పూర్ణ "చూడకుండా వుండలే" నంటూ తిరుగుటపాలో జవాబు వచ్చినట్లు ఉత్తరక్షణంలో కాకినాడ వచ్చి వాలింది. వర్ధనమ్మా, పూర్ణావదినా ఆడపడుచులైనా లోకంలో వాళ్లలా కాకుండా ఎంతో ప్రేమతోటీ, ఎంతో ఐకమత్యంగానూ, వొక్క కడుపున పుట్టిన అక్కచెల్లెళ్ల

కంటేనూ అన్యోన్యంగా మసులుకుంటూ వుంటారు. ఆడపడుచుని చూసి వర్ధనమ్మ యెంతో సంతోషించింది. "నీకు నామీద దయవుంది కనక వచ్చావు. మరొకళ్లైతే 'గాజులు పెట్టించాక మన యింటికే వస్తుం'దని చడీ చప్పుడూ లేకుండా వూరుకుంటా"రని వర్ధనమ్మ చెప్పగా, "దిక్కుమాలిన కర్మం యేలా వుంటారమ్మా, తెలవగానే చూడకుండానూ? మాయింటికి దీపంలాగ నువ్వెంతో వెలుగు తెస్తున్నావు. మీ యమ్మరాసిన వుత్తరం చూశా టప్పటికి నాకు బ్రహ్మానందమయింది. 'అమ్మయ్యా! నట్టింట చంటిపిల్లలు తిరిగీ అదృష్టం మళ్లీ యిప్పటికి పట్టిం'దంటూ నాయనమ్మ పొంగిపోయింది. తాతయ్య నేను బయలుదేరేదాకా తొండలు విడిపించా"డని పూర్ణ చెప్పింది. ఈ అడావిడిలో ఆ పూట కాఫీ పుచ్చుకోవడం యిద్దరూ కూడా మరిచిపోయారు. వర్ధనమ్మ గర్భవతి కావడం నిజమని తేలగానే "వెంటనే రావలసిం"దని పూర్ణ అన్నగారికి రాసింది. అంచేతనే అత నిప్పుడు కాకినాడ వచ్చాడు.

జట్కాబండి గుమ్మంలో ఆగే టప్పటికి ఎప్పటికప్పుడే "ఈబండికి తప్పకుండా వస్తా" డంటూ మాటిమాటికీ వీధిగుమ్మంలోకి వచ్చి చూసి వెడుతూ వుండే పూర్ణకి ముందు సీతారామయ్య కనిపించాడు. ఇంటికి వెళ్లా టప్పుడు తప్పకుండా రాజమండ్రీలో దిగి చూడాలనుకుంటూ వున్న మేనత్త కొడుకు అయాచితంగా కనపడడంచేత బ్రహ్మానందపడుతూ ఆమె "ఎక్కణ్ణుంచిరా బావా?" అంటూ బండి దగ్గిరికి వచ్చా టప్పటికి జానకిరామయ్య దిగాడు. అతన్ని చూడడంతోటే ఆమె కెంతో ఆనందం కలిగింది. వెంటనే ఆమె "ఇన్నాళ్లు చేశావేమి టన్నయ్యా?" అంటూ ముందు దారి తీసింది. ఆ వెనక్కాల తన కాదరం తక్కువయిం దన్నట్లుగా సందేహిస్తూ సీతారామయ్య వెళ్లాడు. బండివాడు సామానింటో పెట్టి సీతారామయ్య దగ్గిర కిరాయి పుచ్చుకుని వెళ్లిపోయాడు.

జానకిరామయ్య నింటోకి తీసుకువెళ్లి వర్ధనమ్మని చూపించడం తొందరలో పూర్ణ సీతారామయ్యకి ఉపచారాలు చెప్పడం మరిచిపోయింది. వర్ధనమ్మ తల్లి కాళ్లు కడుక్కోడానికి నీళ్లిచ్చి కుశలప్రశ్న చేసింది; గాని అతని కెలాగో వుంది. పూర్ణ కంగా రంతా అర్థం అవుతూనే వున్నా—అయినా తా నేదో తప్పు చేసినట్లూ, దాని కామె శిక్ష చేస్తూ వున్నట్లూ,—ఇలాగ ఏమి టేమిటో నిరుత్సాహాలు పెరిగిపోయి అతని మనస్సుని గజిబిజి పెట్టాయి.

"సిగ్గుపడతా వెందుకూ? నువ్వంటే నువ్వంటూ రోజూ నువ్వు చదరంగం ఆడీవాడే కాదూ మా అన్నయ్యా? ఇవాళ నీకు కొత్త అయినాడా?" అంటూ పూర్ణ ఆగడం చెయ్యగా "వుండవో. చెయ్యి విడిచి పెట్టవో" అంటూ వెనక్కి తీస్తూనే గదిలోకి వెళ్లి వర్ధనమ్మ జానకిరామయ్య మందహాసానికి నూత్న తేజస్సు కలిగించింది.

వెంటనే పూర్ణ యివతలికి వచ్చి సీతారామయ్య యోగక్షేమాలు కనుక్కుంది. "మేనల్లుడు పుడతా డన్న సంతోషంలో నీకు నేను కనపడతానా?" అని ముందామెమీద నెపం వేసే అతను జవాబులు చెప్పాడు. వొక్క క్షణం సంభాషణ జరిగా టప్పటికి పూర్ణ అమాయికత్వమూ, ప్రేమా, స్నేహమూ, ఆదరమూ యథాపూర్వంగానే వున్నా యనీ, ఆమె తనని వాకట్లో విడిచిపెట్టి అన్నతో కూడా యింటోకి వెళ్లడమూ, అదీ అస్వాభావికం కా దనీ, పైగా అప్పు డలా చెయ్యడమే గొప్ప చాతుర్యానికీ, బంధుప్రీతికీ నిదర్శనం అనీ అతను గ్రహించాడు. తోడనే ఆమెమీద ఆదరభావం ప్రబలింది. అందుకు తగ్గ స్వరంతో అతను "ఈ సంగతి మా అమ్మ పేరకూడా కాస్త రాయకూడదుటే?" అనగా, "నే నిక్కడికి వచ్చేదాకా స్థిర మైన సంగతి తెలవనే లేదూ. రేపో యెల్లుండో యేలూరు వెడుతూ మీవూరేలాగా వచ్చాటప్పుడిక వుత్తరం రాయడం యెందుకని మానేశానురా" అని ఆమె చెప్పింది. "ఈసంగతి తెలిస్తే నేను వొట్టి చేతులతో రాకపోదును గాదూ?" అని అతను మళ్లీ అనగా, ఆమె "ఇప్పుడైతే మాత్రం మించిపోయిం దేమిటే? బజారులో దుకాణా లిప్పుడే

తెరుస్తూ వుంటారు. తాజా సరుకు మధ్యాహ్నం తేవచ్చునులే" అని బదులు చెప్పింది.

ఇలాగ పది నిమిషాలు గడిచా టప్పటికి జానకిరామయ్య యివతలికి వచ్చాడు. అప్పటికి "మామీద నీకు దయే వుంటే—నే నింకా యేలూరులో బతికే వున్నా నని నీకు జ్ఞాపకమే వుంటే—మొన్న చెన్నాపట్టంనుంచి యింటికి వెళ్లా టప్పుడు మా వూళ్లో దిగకపోదువా యేమిటి? రెండు మాసాలు దాటింది నువ్వు కనపడీ" అంటోంది పూర్ణ. దాని మీద జానకిరామయ్య అందుకుని, "ఇక వీడికి మన మసలే కనిపించవూ. అంటే వీడికీ మనకీ మధ్య పెద్ద గోడ వొకటి లేచిపోతోంది. పరువూ, ప్రతిష్ఠా, సిగ్గూ, బిడియమూ విడిచిపెట్టేశాడులే వీడు వెధవముండని పెళ్లాడతాట్ట వీడు. అంతా సిద్ధమైంది. ముహూర్తం నిశ్చయం చేసుకోవడం కోసమే యీవూరు వచ్చా డిప్పుడు" అన్నాడు. ఇది విని పూర్ణ వులిక్కిపడింది. "అవున్రటా?" అన్నమాట

నామె సరిగా వుచ్చరించలేకపోయింది. వొక మెరుపు నవనాడులూ కుంగతియ్యగా వెంటనే యింకో మెరుపు ఆమె కొత్తరక్తాన్ని వుడు కెత్తించింది. "నీ దగ్గిర దాచడం యెందుకూ? నే నలాగే నిశ్చయించుకున్నా" నన్నా డతను. "ఎవర్రా పెళ్లి కూతురూ?" అని ఆమె మళ్లీ అడగ్గా, "చూస్తావు కాదూ? మీరు వచ్చినా రాకపోయినా మిమ్మల్ని పిలవకుండా పెళ్లి చేసుకుంటానా నేనూ?" అని సీతారామయ్య బదులు చెప్పాడు. ఇంతట్లో గదిలో నుంచి వర్ధనమ్మా, వంటింటో నుంచి అత్తగారూ వస్తూ వుండడం కనిపెట్టి, జానకిరామయ్య "మంచి పనే. ఈపాటికి వూరుకో. ఎవరేనా వింటే నవ్విపోతారు. చెమట ఆరీదాకా వొక్కక్షణం వీథిగదిలో కూచుందాం రా" అంటూ సీతారామయ్యని చెయ్యిపట్టుకుని తీసుకు పోయాడు.

తొమ్మిదింటి దాకా ఏలూరులో ప్లీడరీ గొడవలూ, రాజమండ్రీలో షాపు సంగతులూ చెప్పుకుని భావమరుదు లిద్దరూ యివతలికి వొచ్చి స్నానాలూ, భోజనాలూ చేశారు. భోజనసమయంలో జానకిరామయ్య అత్తగారూ, మామగారూ సీతారామయ్యని చాలా ఆదరించి మాట్లాడేరు. భోజనానంతరం పురుషులు హాలులో పడక కుర్చీల మీద కూచునే టప్పటికి వర్ధనమ్మ తాంబూలాలు తెచ్చి యిచ్చింది. ఆమెతండ్రి కలెక్టరు కచేరీకి వెళ్లి పోయాడు.

స్త్రీలు భోజనాలు చేసీదాకా భావమరుదు లిద్దరూ మళ్లీ లోకాభిరామాయణం విడేశారు. భోజనం దగ్గిర పూర్ణ మందకొడిగా వుండడం చూసి వర్ధనమ్మా, తల్లీగూడా "ఏం చెప్మా" అనుకున్నారు; గాని కారణం బోధపడలేదు. చివరి కెలాగో వొకలాగ భోజనా లయినాయి. దక్షిణపు వసారాలో వున్న వుయ్యాలాలో కూచుని తాంబూలం వేసుకుంటూ వర్ధనమ్మ "రాత్రి నిద్ర చాలదేమోనో" అంది. దాని మీద పూర్ణ "అవునో. నా కేనా తోచింది కాదేమిటే?" అంటూ యివతలికి వచ్చి, "రాత్రి నిద్ర చాలదేమో పడుకుంటావా యేమి టన్నయ్యా?" అని జానకిరామయ్య నడిగింది. దాని కతను "ఇంతా అంతా కాదు నిద్ర. వొంటిగంటకి మెళుకువ వచ్చింది. వెంటనే స్టేషనుకు వచ్చాను. అయితే యింటివా రేమేనా కాస్త—నడత

మంచమేనా చూపిస్తారేమో కనుక్కో చెల్లీ" అన్నాడు. ఈమాట చెవిని పడగా యింటియజమానురాలు కూతురు కోసం వెదికి, ఆమె మేడమీద కనబడగా, "సరే" అని వూరుకుంది. ఇక్కడ పూర్ణా, సీతారామయ్యా ఆమాట మీద సరాగాల కందుకోగా, జానకిరామయ్య యాదాలాభంగా పైకి చూసి, అక్కణ్ణుంచి వర్ధనమ్మ కనుసన్న చేయగా, "చెల్లీ! సెలవౌతోంది. వోరే బావా! కాస్తసేపు పడుకుంటానురా. ఇప్పుడుండే పనితొందరలో నీకు నిద్ర రాదు; గాని వస్తే రా" అంటూ మెల్లిగా పైకి చక్కాపోయాడు. "పెట్టి పుట్టావు కనక సుఖంగా నిద్రపోతావు నువ్వు. నేను నుంచున్నపళంగా జగన్నాథపురం వెళ్లా" లంటూ సీతారామయ్య లేచాడు. "నువ్వు గూడా పడుకుంటే బాగుండును. అంతపని వుంటే యేలాగా మరీ? తొరగా రారా" అంటూ పూర్ణ అతన్ని వీథిగుమ్మందాకా సాగనంపి యజమానురాలి దగ్గిరికి వెళ్లి కూచుంది.

అతను వెళ్లేటప్పటి కక్కడ గుమ్మంలో వొక మోటారు సిద్ధంగా వుంది. "ఎవరేనా వచ్చారా, వెడతారా?" అంటూ అతను గుమ్మం యెక్కేటప్పటికి, రైలులో కలిసి వచ్చిన తరుణి చకచకా యెదురువచ్చి "మీరు వచ్చారా? నేను కొంచం తొందర పనిమీద వొకచోటికి వెడుతున్నాను. నాలుగయితే గాని యింటికి రాను. మళ్లీ అయిదింటికి బీచికి షికారు వెడతాం. కనక మీరు రేపుపొద్దున్న తొమ్మిది దాటాక వస్తే మాట్లాడుకోడానికి వీలు కావచ్చును." అని చెబుతూనే మోటా రెక్కి "రామారావుపేట" అని డ్రైవరుతో చెప్పింది. సీతారామయ్య మొగం చిట్లించుకుంటూ గుమ్మం దిగాటప్పటికి కారు వెళ్లిపోయింది. "వాలకం చూస్తే మొగాడికంటేనూ స్వేచ్ఛగా వుండేలా వుంది. మద్రాసులో తొందరపడడం చూసి అదంతా చదువు కోసం అనుకున్నాను. చాలు చాలు" అనుకుంటూ అతను జట్కాయెక్కి "బయలుదేరిన చోటికే" అని బండివాడితో చెప్పాడు.

వచ్చాటప్పు డతనికి "బావ చెప్పిన మాటల్లో యథార్థం వుందా" అని సందేహం తోచింది. "కాని అందరూ వొకలాగే వుంటారా?" అని ఎవరో ప్రశ్నించినట్లు కాగా, "మంచి చెడ్డలన్నింటిలోనూ వుంటాయి. ఇంత మాత్రానికే సిద్ధాంతాన్ని కొట్టెయ్యడానికీ, సంస్కర్తల్ని నిందించడానికీ వల్లకా"దని నిశ్చయం చేసుకున్నాడు. "పోనీ, వరణసామర్థ్యం లేకపోయినా, కాపరానికి రావడం ఆలస్యమైనా కన్యనే పెళ్లాడితేనో" అని యింకోమాట తోచింది; కాని "మంచికో చెడ్డకో వితంతువుని పెళ్లాడా లని బుద్ధి పుట్టింది. అదేదో చివరిదాకా చూడవలిసిందే" అని దృఢనిశ్చయం చేసుకున్నాడు. అప్పటికి బండి గమ్యస్థానం చేరింది. వెంటనే బండివాణ్ణి పంపేసి అతను గుమ్మం యెక్కేడు. వదినగారితో మాట్లాడుతూ వాకట్లో నుంచుని వున్న పూర్ణ చల్లపడిందాకా రా డనుకున్న మేనత్తకొడుకు అప్పుడే రావడం చూసి, "రారా, బావా" అంటూ యెదురు వచ్చి లోపలికి తీసుకు వెళ్లింది. కొంతసేపు ఆమాటా ఈమాటా అయినాక, అతను నిద్రవొస్తోందనగా, మేడమీదకి తీసుకు వెళ్లింది.

3

పొద్దున్న యేడున్నర అయింది మొదలుకొని యెదురు చూస్తూ వున్న యేకాంతం యిప్పటికి దొరికింది పూర్ణకి. దక్షిణపు గది వసారాలో జానకిరామయ్య గాఢనిద్రలో వున్నాడు. ఉత్తరపు వసారాలో సీతారామయ్య మడత మంచంమీదా, పూర్ణ పడక కుర్చీలోనూ కూచున్నారు. అతను నడుం వాల్దా మనుకుంటూ వుండగా ఆమె అందుకుంది:

"ఏమిరా బావా! నిజం చెప్పవూ?"

"నే నెప్పుడేనా అబద్ధం చెప్పడం యెరుగుదువా?"

"అంచేతే నమ్మలేకుండా వున్నాను. భమిడిపాటివారి యింటో పుట్టి నోరివారి యింటో పెరిగావు. ఇలాంటి సాహసం కలగడం—"

"ఆశ్చర్యం యెందుకూ? చదివింది యింగ్లీషూ. దేశం అంతా చూశాను. అనేకసంఘాల ఆచారాలు పరిశీలించాను. బ్రాహ్మణ్యం వొకటే ముక్తిసాధనమనీ, మన ఆచారాలు మాత్రమే మంచివనీ చెప్పడానికి వల్ల

కాదు. పైగా అన్ని దేశాల్లోనూ కాలాన్ని పట్టి ఆచారాలు మారుతూ వచ్చాయి. మారుతున్నాయి. ఇంకా మారతాయి."

"అదంతా యిప్పు డెందుకూ?"

"నా నిశ్చయాన్ని గురించి సమాధానాలు వినాలంటే కొంచెం వోపిక పట్టాలి. వారకంచేత నడవలేకా, రైలెక్కితే బ్రాహ్మణ్యం చెడిపోతుం దనీ, వుర్లాం ప్రయాణం మానుకున్న తాతయ్య నన్నూ, బావనీ విధర్మాన్ని బోధించే యింగ్లీషు చదువులో ప్రవేశపెట్టాడు."

"అదే కొంపముంచీలా వుంది చివరకి."

"ముంచదు ముంచదు; తేలుస్తుంది. ఇంగ్లీషు విద్యకి మనం చాలా ఋణపడి వున్నాం. నిజంగా యింగ్లీషు మన కళ్లు తెరిచింది. ఒక సంగ తడుగుతాను: శాంతంగా విని, జాగ్రత్తగా ఆలోచించి, సరిగా సమాధానం చెబుతావా?"

"అడుగు."

"ఎనిమిదో యేట నీకు పెళ్లయింది; పదకొండో యేట మోడు వైపోయావు; ఇప్పు డిరవై రెండో యేడు నడుస్తోంది. ఈడు వచ్చినప్ప ణ్ణుంచీ—అంటే యే డెనిమి దేళ్లనుంచి నువ్వు నిజంగా యమయాతన అనుభవిస్తున్నావు."

"పూర్వజన్మంలో చేసిన పాపం—"

"నువ్వా, తాతయ్యా? అడిగేవాడు లేక కాని కళ్లు తెరవని వయస్సులో నీకు పెళ్లి చెయ్యడానికీ, మొగు డంటే యేమిటో తెలవందే ముండామోశా వనడానికీ, నీజీవితాన్ని యిలా బగ్గంపాడు చెయ్యడానికీ, యెవడి కధికారం వుందీ? పోనీ నువ్వు పూర్వజన్మంలో యేదో పాపం చేశా వనీ, అది యిప్పు డిలా అనుభవిస్తూ వున్నా వనీ, అనుకుంటూ వూరుకున్నవాళ్లంతా నువ్వు మళ్లీ—"

"అయ్యో!"

"ఏమీ?"

"మొగుడు చచ్చిపోతే ఆడాళ్లు మళ్లీ పెళ్లాడ్డం బ్రాహ్మల్లో యెప్పు డేనా వుందా?"

"ఎప్పు డేనా వుందా అంటే దానికి సమాధానాలు చరిత్రలో కావలసినన్ని వున్నాయి. మళ్లీ పెళ్లాడితే నిజంగా కొంప మునిగిపోతుందా? సంసారంలో పురుషుని కెంత విలువ వుందో స్త్రీకీ అంతే వుంది. ఈశ్వరసృష్టిలో పురుషు డెలాంటివాడో స్త్రీ కూడా అలాంటిదే? సౌఖ్యమూ, ఆనందమూ అనుభవించడానికి పురుషుని కెలాంటి హక్కు వుందో స్త్రీకీ అలాంటిదే వుంది. పెళ్లిఅనేది యిద్దరికీ సమానమే. స్త్రీ అంటే రాయికాదు; బొమ్మ కాదు. నా శరీరం యెలాంటిదో నీ శరీరమూ అలాంటిదే. ఎన్నిమాట్లేనా పెళ్లాడే మొగాడికి పుణ్యమే వస్తే మళ్లీ పెళ్ళాడీ ఆడదానికీ వస్తుంది. గార్హస్థ్యం అంటే పురుషుడు వొక్కనితోటే లేదు."

"మన శాస్త్రాల్లో అలా యెందు కుందీ?"

"అలా రాశారు కనకా. అలా యెందుకు రాశారంటే అప్పు డలాంటి అవసరం యేం వచ్చిందో. ఆరాతరాసిన తరవాత యెన్ని సంవత్సరాలు గడిచాయో. ఎన్ని ఆచారాలు మారిపోయాయో. ప్రపంచకంలో వున్న తక్కిన జాతు లన్నీ కాలానుగుణ్యంగా నడుచుకుంటూ—"

"వాళ్లంతా బ్రాహ్మలంత గొప్పవాళ్లా?"

"వాళ్లదగ్గిర యీమాట అంటే బ్రాహ్మలకంటే అధము లెవళ్లంటారు. బ్రాహ్మల దారి వొకవిధమైనది; తురకలదారి వొకమోస్తరూ; కిరస్తానీల దింకో మాదిరి; పార్శీలది మరోరకం, అక్కడిదాకా యెందుకూ? మేనరికం. అంటే మనం చెవి కోసుకుంటాం, ద్రావిళ్లదగ్గిర ఆమాట యెత్తితే ఛీ ఛీ అంటారు."

"ఎంచేతా?"

"వాళ్ల కలా తోచింది కనక."

"ఇవన్నీ మనవా ళ్లేర్పరుచుకున్న వంటావా?"

"ఇంకా నింపాదిగా అడుగుతావా? దేశప్రకృతిని పట్టి ఒక్కొక్క తెగవా ళ్లొక్కొక్క విధంగా ఆచారా లేర్పరచుకున్నారు. తరవాత కాలాన్ని పట్టి

మంచి చెడ్డలు గమనిస్తూ అవసరమైన ఆచారాలలో మార్పులు చేసుకుంటూ ఆమార్పులు ధర్మశాస్త్రాల్లోకి ఎక్కించుకుంటూ వచ్చారు. ఆలాగే మనవాళ్లలో కూడా వితంతువివాహాలు —"

"లోకం హర్షిస్తుందా?"

"లోకం అంటే యెక్కడికీ? మనవాళ్ల సంగతి యిప్పు డెలా వుందంటే, ఎవడిమట్టుకు వాడు శాస్త్రాన్ని దూరంగా తన్నేసి, తన అనుకూల్యాన్ని పట్టి నడుచుకుంటూ, ఎదటివాడికి పంగనామాలు పెడుతున్నాడు. కనకనే మనసంగతి యిలా వుంది. ఇక లోకం హర్షిస్తుందా అంటే హర్షించక యేం చేస్తుందీ? ఏం చెయ్యగలమూ? ఏం చెయ్యగలుగుతోందీ? మాపెత్తండ్రి మనమరాలి మొగుడు లండను వెళ్లి వచ్చాడు. మాపెత్తాత మనమరాలి కొడుకు అందరితోటే బాహాటంగా భోజనం చేస్తాడు. మామేనత్త కొడుక్కి మొన్న మొన్న — పదహారో యేట అయింది వొడుగు. వాడి మేనత్త కూతురికి రజస్వల అయిన తరవాతే పెళ్లికావడం అంతా యెరుగుదురు. వాళ్ల నెవళ్లేం చేశారూ?"

"ఆలాగే నువ్వూ వెధవని పెళ్లాడతానంటావా?"

"ఇంకా సందేహమా?"

"అయితే యెవర్తిని పెళ్లాడతావు రా?"

ఈ ప్రశ్న అడిగేటప్పుడు పూర్ణ హృదయం గుబగుబ లాడింది. పాదాదిశిరఃపర్యంతమూ రక్తమంతా వొక్కమాటు వుడుకెత్తి ఏదో మెరుపుదెబ్బ తగిలినట్లయింది. అచ్చంగా తనలాంటి తరుణి వొకతె పుణ్యస్త్రీ వేషంతో పిల్లలతోటీ, మొగుడుతోటీ, జన్మ కల్లా నిగ్గయిన తృప్తితోటీ, ఆనందంతోటీ ముఖమ్మీద హృదయాకృతి అంతా అచ్చుపడుతూ వుండగా, సుఖమయసంసార సరస్సులో నౌకావిహారం చేస్తూ వున్నట్లొక దృశ్యం ఆమెకి కొన్నాళ్ల కిందట సినీమాలో చూసినట్లు తోచింది. ఇలాంటి భావనల వల్ల తమ కృత్రిమ నిబంధనల నెక్కడ జవదాటిపోతుందో అని భస్మధారులూ, కుండలధారులూ అయిన బోసినోటి శాస్త్రులవార్లు కొందరు, సుఖావేదనతో మెల్లి మెల్లిగా — హృదయం బలవంతం చేస్తూ వుండగా, జడుస్తూ జడుస్తూముందుకడుగు వేస్తూ వున్న తనని రెక్కలుపట్టుకుని వెనక్కి లాగుతూ "రా వెనక్కి. బుర్ర గొరిగించుకో. చేతుల వున్న మురుగులూ, మెడలో వున్న గొలుసూ మాకిచ్చెయ్యి. మల్లుపంచె విప్పేసి సైను గుడ్డ కట్టుకో. ఆవుపేడా అలుగ్గుడ్డా పుచ్చుకొని పద సంటింటోకి" అని బలవంతం చేస్తూ వున్నట్లు తోచింది. ఇంకా సుఖమయాలూ, దుఃఖపూరితాలూ అయిన యిలాంటి ఆశలూ, కష్టానుభవాలూ హృదయాన్ని కలత పెడుతూ వుండడంచేత "ఇంకా నిశ్చయం కాలే" దని సీతారామయ్య చెప్పిన సమాధానం ఆమెకి వినపడలేదు. ఆమె శిరస్సు వంచుకుని మాట్లాడకుండా వుండడం చూశాడతను. వొక్క క్షణం వూరుకుని "మాట్లాడవేమే?" అన్నాడు. చివరకి "నేనన్న మాటలికి కోపం వచ్చిందా?" అని అడుగుతూ లేచి నుంచున్నాడు.

అప్పుడు పూర్ణ జొటజొట కన్నీరు కారుస్తూ, "నువ్వన్నట్లే డెనిమి దేళ్ళనుంచి నేను యమబాధ అనుభవిస్తున్నాను. నాలాగ కుళ్లిపోతూ వున్నవాళ్లు వేలూ, లక్షలూ వున్నారు. ఆడాళ్ల బతుకింత లేలిక యెందుకయిపోయిందీ? దేవుడు మొగాళ్లని కుడిచేత్తోటీ, ఆడాళ్ళని యెడంచేత్తోటీ చేశాడా?" అంది.

"ఇప్పటి దాకా హిందూస్త్రీకి ఇలాంటి ఆవేశం కలగలేదు. ఆమె పురుషు డంటే దేవు డనుకుంది. అతను రాజనీ, తాను నౌకరనీ నమ్మింది. మొగాడు ఏం చేసినా వొప్పుకుంది. అన్నం తినమంటే తింది. నిద్ర పొమ్మంటే పోయింది నువ్వు మనిషివి కా దంటే వొప్పుకుంది. ఈకారణాలచేత మొగాడికి కళ్లు మూసుకుపోయాయి."

"బావోయి! నిన్నుకూడా తిడుతున్నా ననుకోకు. మొగాళ్లకంటే రాక్షసులు నయం. అందులోనూ వేదాలూ, శాస్త్రాలూ చదువుకున్నవాళ్లు నల్లరాళ్ల కంటేనూ కఠినులు. కన్న కూతుళ్ల గొంతుకులు కూడా వాళ్లు నదురూ, బెదురూ లేకుండా పరపరా

కోసేస్తారు. రామరామా! నా జుట్టు తీయించేయ్య మని తాతయ్య చేసే రభసం చెప్ప తరమా? నా మూలా లాన్ని సాటి వాళ్లలో తనకి తలవంపులుగా వుందిట. ఏమీ యెరగందే నేను ముండామోశా ననడం నాసాటి వాళ్లలో నాకు తలవంపులుగా లేదూ? నా పెళ్లి నే నెరగను: నా మొగుణ్ణెరగను;ముండామొయ్యడం వొక్కటే నాకు కనబడుతోంది. నా పెళ్లి నాకోసమా? ఇతర్ల కోసమా? నే నెరగని—నా కోసం కాని—పెళ్లివల్ల నాకు వెధవరికం యేమి టోయి?"

"నీలాగ కుళ్లిపోతూ వున్న పడుచులు లక్షలున్నా రన్నావు. వాళ్లందరూ యెందుకు సాహసించ కూడదూ? శాస్త్రాల విలవ నాడే గంగలో కలిసింది."

"బతకడానికి వీల్లేని ధర్మాలు చెప్పి అలా నడవమంటే శాస్త్రాల నెవళ్లు గౌరవిస్తారూ?—"

"ఇక సంఘం వుంది. సంఘంలో యిప్పు డెవళ్ల దారి వాళ్లదీ. విధినిషేధాలు పోయాయి."

"అయినా తరతరాల నుంచి వస్తూవున్న విశ్వాసం వొకటి వుంది కదూ? ఈయమబాధని కూడా నిర్లక్ష్యం చెయ్యడానికి కారణం అదీ. శాస్త్రాలు దేవుని వుపదేశాలు అనే నమ్మకం వున్నంత కాలమే వాట్లకి విలవ. తరవాత మనశాస్త్రాలన్నీ కొల్లేటిపాలే. మనుష్యుల నిన్ని విధాల విడతీసిన శాస్త్రాలు యింకా లోకంలో యెక్కడేనావున్నాయా?"

"ఈ కర్మభూమిలో—ఈ పుణ్యభూమిలో—సారంవిరిగి పోయిన యీ చాటిపత్రలో తప్ప మరెక్కడా లేవు."

"బావా! ఇం కెందుకూ? వెధవలు మళ్లీ పెళ్లాడితే పనికిరాని మతం వెధవ లుంటే పనికివస్తుందా?" వొక దారీ, వొక తెన్నూ లేని మతాన్ని లక్ష్యపెట్టడం యెందుకూ? ఎవళ్లేం చేసినా యెవళ్లూ యేమీ చెయ్యలేనప్పుడు నువ్వు "ఇక గతిలే" దని నిరాశ చేసుకొని వున్న వొకవితంతువుని ఉద్ధరించడం తప్పు కాదు. ఆడదానివుసురు మహాచెడ్డది. బావా! నావంటివాళ్లంతా యీ దుర్గతి దేవుడు కలిగించిందే అనుకుంటున్నారు; గాని మనుష్యులు—అందులోనూ మొగాళ్లు—వేద శాస్త్రాలు చదువుకున్న బ్రాహ్మలు కలిగించిం దని తెలుసుకున్నారంటే వాళ్లవుసురు తగిలి యీదేశం అంతా వొక్క క్షణంలో బుగ్గయిపోతుంది. కనక వొక్క ఆడదాన్ని రక్షించినా రక్షించడమే. బావోయి! మానకు; ఇక సందేహించకు; ఆలస్యం చెయ్యకు. ఎవర్తి పుణ్యం పుచ్చిందో, యెవర్తి అదృష్టం పండిందో, నీ కిలాంటిబుద్ధి పుట్టింది. వితంతువునే పెళ్లాడు బావా! పెళ్లాం చచ్చిపోతే మొగాడు దుఃఖించడం నిజమే కావచ్చును; కాని ఆదుఃఖాని కంతం వుంది. మాబతు కేం చెప్పను బావా? అయ్యో! ఈబ్రాహ్మణజాతిలో పుట్టడం కంటే పురుగై పుట్టడం మంచి దేమోనోయి!"

పూర్ణ యిలా చెప్పడం మాని సీతారామయ్య నిర్విణ్ణుడైపోయాడు. ఆమె విశాలనేత్రాలలో నుంచి



చెక్కుల మీదుగా ప్రవహిస్తూ వున్న కన్నీరు యావద్భారతమహిళామండలియొక్క కరిగిపోయినహృదయాల లాగ తోచిం దతనికి. రావిరేకల లాగ కదలిపోతూ వున్న ఆమె పెదవులు చూసి అతను యీభరతవర్షం అంతా గడగడ వొణికిపోడాని కిం కెంతో సేపు పట్టదని భయపడ్డాడు. పొద్దున్న తాను బండి దిగే టప్పటికి కలకల లాడుతూ వున్న ముఖంమీద యిప్పు డింత విచారం అంకితం కావడం చూడగా అతనికి ప్రపంచకం అంతా మహాంధకారంలో మునిగిపోతూ వున్నట్లు తోచింది. ఈకారణాలచేత అతని హృదయం కంపించిపోసాగింది. చూస్తూ వుండగా ఆవొణుకు కాళ్లల్లోనూ, పెదవుల్లోనూ, మాటల్లోనూ కూడా కనపడింది. ఇక కూచోలేకపోయాడు. తూలుతూ తూలుతూ లేచి నుంచుని, అతను "వదినా! నీ కిలాంటి సాహసం కలుగుతుం దని నే నెప్పుడూ అనుకోలేదు. నీ హృదయం యింత దయాపూరిత మనీ, నీ మన స్సింత నవనీతకోమలమైన దనీ నే నెప్పుడూ అనుకోలేదు. నా సంగ తంతా ఆమూలాగ్రంగా తెలిసిన నువ్వు ఇప్పు డిలా చెబుతూ వుండగా నా కింక సందేహం యెందుకూ ? నువ్వుచెప్పిన ప్రకారం నేను తప్పకుండా వితంతువు నే పెళ్ళాడి హిందూపురుషులు స్త్రీజాతికి చేసిన ద్రోహంలో అణుమాత్రమైనా తగ్గిస్తా" నన్నాడు; కాని పూర్ణ కింకా శోకావేగం తగ్గ లేదు. ఆమె యింకా వెక్కి-వెక్కి యేడుస్తూనే వుంది.

జానకిరామయ్య సరిగా యిలాంటప్పుడు కళ్లు నులుముకుంటూ వచ్చాడు. అతను పూర్ణను చూసి అదిరిపడి, "ఎందుకే చెల్లీ?" అంటూ ఆమె దగ్గిర నుంచుని సీతారామయ్య కేసి ఫులుకూ ఫులుకూ చూశాడు. దానితో యిద్దరూ కూడా వులికిపడ్డారు. సీతారామయ్య యింకా తేరికోక ముందే పూర్ణ అందుకుని మరింత వెక్కి-వెక్కి యేడుస్తూ, "నిక్షేపంలాంటి బావ యెక్కడో యెవ ర్తినో వితంతువును పెళ్ళాడి మనకి దూర మైపోతాడుట. అదే నిజ మైతే వీ డిక మనకళ్లకి కనపడతాడా ?" అంటూ మరింత దుఃఖించింది. అంతట జానకిరామయ్య చెయ్యి పట్టుకుని ఆమెను లేవతీసి, "ఇంతేక దా ? బుద్ధిపూర్వకంగా కులం చెడతా నంటే యెవ ళ్లేం చెయ్యగలరూ ? ఇంతకీ మనకి దూర మైనా ఆకొత్తపెళ్ళామూ వాడూ సుఖంగావుంటేఅంతేచాలు" అని వోదార్చి, సీతారామయ్య కేసి తీవ్రంగా చూస్తూ, "చూశావా, అప్పుడే యెంత గోల మొద లయిందో ? ఇప్పు డేనా బుద్ధి తెచ్చుకో" అన్నాడు. వొక్క క్షణం దాకా యెవరూ యేమీ మాట్లాడలేదు. తరవాత పూర్ణ చెయ్యివిడిపించుకొని "నువ్వు పద వస్తా" ననగా జానకిరామయ్య కళ్ళు బాగాతుడుచుకుని, "మరి రా కిందకి" అంటూ వెళ్లి పోయాడు. మెట్లమీద వర్ధనమ్మ యెదురుపడింది. అతను "కిందకి రా" అనగా ఆమె "మీకు చొక్కా తెస్తా"నంది; కాని అతను "ఇప్పు డక్కర లేదు లే" అంటూ చెయ్యి పట్టుకుని కిందకి తీసుకుపోయాడు.

అక్కడ పూర్ణ అప్రతిభుడై వున్న సీతారామయ్యతో "బజారుకి వెళ్లి రా" అంది. దానితో అతను ప్రకృతిలో పడి మేడ దిగి, బజారుకి వెడుతూ, "వదిన కథ అంతా అలామార్చేసిందేం" అని చర్చించుకోవడం మొదలు పెట్టాడు.

౪

"మీ బావ యెక్కడికి వెళ్ళారో ?"

"ఎందుకూ ?"

"కాస్త కాఫీ—"

"వొట్టి కాఫీ యిస్తావుటో మా బావకి ?"

"మా అమ్మ యేం చేస్తోందో చూశావా ?"

"వుయ్యాలామంచంమీద పడుకుని—"

"చాల్లే నేర్చుకుపోయావు. దుడుకూ దుడుకూ మాట లనెయ్యడమే కాదూ యెప్పుడూనూ!"

"మ రేం చేస్తోందో చెప్పావా యేమిటి నువ్వు?"

"నువ్వడిగావా?"

"ఏ పోకుండలో, యే వుండ్రాళ్లో—"

"సిగ్గుసిగ్గు. ఊరుకో యీపాటికి."

పూర్ణా, వర్ధనమ్మా యిలా సరాగా లాడుకుంటూ వున్న సమయంలో సీతారామయ్య వొక అర్ధమణుగు మిఠాయీ, మైసూరుపాకూ, జహాంగీరూ, కోవాబిళ్లలూ, మొదలైన మధురపదార్థాలున్నూ, మరో యెత్తెడు కారపు సరుకున్నూ తెచ్చి వాకట్లో బల్లమీద పెట్టాడు. వెంటనే పూర్ణ అవన్నీ యింట్లోకి పట్టుకు వెళ్లి, "ఏమండోయి అత్తగారూ, మీరూ, మీ అమ్మాయీ వొక మాటు మడి కట్టుకు రండీ. మీ తాహతెక్కడ, మా తాహతెక్కడ? మీతో సమానంగా మేము పెట్టగలమా పొయ్యగలమా! అయినా యేదో కాస్త—తొరగా లేవా"లంటూ వాట్లని వర్ధనమ్మ తల్లి యెదట పెట్టింది. పాపం ఆవిడ హఠాత్తుగా చూసి, యెవరు తెచ్చారో గ్రహించలేక "ఇవన్నీ యెందుకు తెచ్చారమ్మా, నేను చేస్తూ వుండగానూ?" అంది. "మీరు చేస్తున్నారని మాకు కల వచ్చిందా యేమిటీ? కాకపోయినా మీరెప్పుడో చేసీ దాకా మేం వుండలేము సుమండీ. మీరు చెయ్యడమే నిజమైతే దాచుకోండి; మేం వెళ్లాక తలుపులు బిడాయించుకుని మీరూ, మీ అమ్మాయీ తిందురుగాని" అని పూర్ణ మళ్లీ అనగా, వర్ధనమ్మ అందుకుని, "వదినె తెప్పించిం దనుకున్నావా యేమిటే, సొంతడబ్బు ఖర్చుపెట్టి? అన్నయ్యగారు తేగా యీవిడ మనకి బంతివేస్తా నంటోంది. పోనీ వోపని చెయ్యవో వదినా. మా అమ్మ చేసినవీ, మా అన్నయ్యగారు తెచ్చినవీ నువ్వన్నట్టే దాచుకుని తలుపులు బిగించుకుని మేం తింటాం నువ్వూ, మీ అన్నయ్యా వుండలేరు కనక తొంగగా కాఫీహోటలుకి వెళ్లిరండి" అంది.

మళ్లీ పదినిమిషాలు వేళాకోళాలు జరిగాయి. తరవాత యజమానురాలు పడమటింట్లో వొక గోడ దగ్గిర రెండుపీటలూ, వొకగోడ దగ్గిర రెండుపీటలూ వేసి, జానకిరామయ్యకీ, సీతారామయ్యకీ, వర్ధనమ్మకీ, పూర్ణకీ ఫలహారాలు పెట్టింది. వారు వొక్కొక్కరే వచ్చి కూచుని మిఠాయివుండలు వొకరూ, జహాంగీర్లు వొకరూ, చిదుపుతున్నారు. సరిగా పూర్ణ పూరీ విరిచే సమయంలో ఇంటి యజమానుడు చక్కా వచ్చాడు. అతన్ని చూసి అంతా తెల్లపోయారు. వెంటనే సీతారామయ్య "రండి బాబుగారూ; పిన్నిగారూ, బాబుగారికికూడా వడ్డించండి తొరగాను" అన్నాడు. అతనలా అంటూ వుండగానే వర్ధనమ్మ పీట తెచ్చి సీతారామయ్యదగ్గిర వేసింది. "మీరు కానిస్తూ వుండండి" అని వెళ్లి యజమానుడు చేతులూ కాళ్లూ కడుక్కొని వచ్చాటప్పటికి యజమానురాలు అతనికూడా వడ్డించింది. అతను పెద్దవాడు కనక యెదట కూచుని ఫలహారం చెయ్యడానికి పూర్ణ కొంచెం సందేహించింది; గాని వర్ధనమ్మా, యజమానురాలూ తప్పులేదని బలవంతం చేసి కూచోపెట్టారు. "మా వర్ధని యెలాంటిదో నువ్వూ అలాంటిదానవే. బిడియం యెందు కమ్మా? కూచో కూచో. నలుగురమూ కూచుని ముచ్చటగా ఫలహారం చెయ్యవచ్చు ననే ఇవాళ అడావుడిగా యింటికి వచ్చా" నని యజమానుడు కూడా చెప్పేదాకా పూర్ణ పూరీ ముట్టుకో లేదు. తరవాత అంతా ఫలహారం ప్రారంభించారు; గాని వొకళ్లూ మాట్లాడలేదు. దానిమీద యజమానుడు "ఏం వూరుకున్నారేం? మీ వేళాకోళాలికీ, సరాగాలికీ నే నడ్డు వచ్చానా యేమి?" టనగా వర్ధనమ్మా, జానకిరామయ్యా వోరకంటితో చూసుకుని లోపల లోపల నవ్వుకున్నారు. పూర్ణ మొగం వంచుకొనే నవ్వుకోగా, సీతారామయ్య "బాబుగారు బాగా కనిపెట్టారు. వేళాకోళాలు లేకపోయినా మీరు వుండడంచేత బంతి చాలా నిండుగా వుంది. అన్నీ దగ్గిర పెట్టేసి పిన్నిగారు కూడా కూచుంటే బాగుండు" నన్నాడు. "మనం అవతలికి వెళ్లాక వదినా, అత్తగారూ చాటుగా కూచుని యెలాగా మళ్లీ తింటారు" అని పూర్ణ అనే టప్పటికి వర్ధనమ్మ అందుకుంది. దానిమీద జానకిరామయ్య అందుకున్నాడు. మొత్తంమీద వారంతా యిలాగ వొకరి తరవాత వొక రందుకోబట్టి కాని లేకపోతే యజమానురాలు కాళీ అయిన పళ్లేలు వెంటవెంటనే భర్తీ చెయ్యలేకే పోవును.

ఎలాగైతే యేమి? ఫలహారా లయినాయి. వర్ధనమ్మ తండ్రికీ, సీతారామయ్యకీ, జానకిరామయ్యకీ మళ్లీ తాంబూలా లిచ్చింది. యజమానుడు మళ్లీ కచేరీకి వెళ్లిపోయిన తరవాత వీధిగదిలో కూచుని ఆయువకులూ,

వుయ్యాలామంచంమీద కూచుని ఆయువతులూ జాతే హాలు మొదలు పెట్టారు. యజమానురాలు "రాత్రికి ముప్పంకాయ వండనా, బంగాళాదుంపలు వేయించనా?" అని ఆలోచనలో పడింది.

✂

అయి దయిన తరవాత జానకిరామయ్య "బీచికి వెడదాం లె"మ్మనగా, సీతారామయ్య "సినీమాకి వెడదాం ర"మ్మన్నాడు. బీచిలో వుండే ఆధిక్యాన్నతను ఆర్గ్యూ చెయ్యగా సినీమాలో వుండే విశేషాలతను జాబితా వేశాడు. తీర్పుకోసం జానకిరామయ్య వర్ధనమ్మనీ, సీతారామయ్య పూర్ణనీ అడగ్గా, వారిద్దరూ యజమానురాలితో ఆలోచించి "సినీమాకే వెడదాం" అన్నారు.

టిక్కెట్లు పుచ్చుకునే టప్పుడు సీతారామయ్య "వోరేయి బావా! మన వాళ్ళని కూడా మన దగ్గరే కూచోపెట్టుకుందాం" అనగా "సరే" అని జానకిరామయ్య నాలుగూ పెద్ద టిక్కెట్లు తెచ్చాడు. వర్ధనమ్మా, పూర్ణా వరసగా కూచోగా, వర్ధనమ్మవైపున జానకిరామయ్యా, పూర్ణవైపున సీతారామయ్యా కూచున్నారు. ఆవరసలో వారు నలుగురే వున్నారు.

ఫిలిము మొదలయింది. మొదట వొక ఇంగ్లీషు ప్రహసనం చూపించారు. తరవాత "చెల్లతగ్గ పెళ్లి" అనే కథ వచ్చింది.

మొదట నలభై యేళ్ల బ్రాహ్మడు తెర యెక్కాడు. అప్పటి కతనికి మూడు పెళ్లిళ్లయినాయి. తరవాత మూడో పెళ్లి తాలూకు పదహారేళ్ల పెళ్లాం కొన్నాళ్లు కాపరం చేసి చచ్చిపోయింది. అతని దగ్గిర చాలా డబ్బు వుండడంచేత రోజులు వెళ్లకుండానే మళ్లీ పెళ్లి కుదిరింది. మూడో పెళ్లాం చచ్చిపోయిన పద మూడో నాడు నాలుగో పెళ్లి చేసుకొని అతను మనుగుడుపులికి వెళ్లాడు. దానిమీద సీతారామయ్య "పెళ్లాం చచ్చిపోతే రవ్వం తేనా దుఃఖంయెరగడే. వాడు నల్లరాయా, వుక్కుతునకా?" అనగా జానకిరామయ్య "మళ్లీ పెళ్లాడకపోతే వాడి బతుకెలా గడుస్తుందీ?" అన్నాడు. "ఆమాత్రం స్త్రీలకిమాత్రం చెల్లదూ?" అని సీతారామయ్య టోకాయించిఅడిగాడు; గాని జానకిరామయ్య జవాబు చెప్పలేదు.

ఆపిల్ల కాపరానికి వచ్చింది. అంటే పిల్ల బొద్దుగా వుండడం చూసి రజస్వల కాకుండానే ఆ బ్రాహ్మడు పోరి నిషేకం చేసుకుని ఆమెని తన యింటికి తెచ్చుకున్నాడు. చిన్నతనంచేత ఆపిల్ల కాపరం చెయ్యడానికి భయపడగా, అతను యినపపెట్టెలో వున్న డబ్బు చూపించి, "నన్ను సుఖపెడితే యీడబ్బుతో నువ్వు కోరిన నగలు చేయిస్తా" నన్నాడు. నగల కాశపడి ఆపిల్ల చెప్పినట్లే నడుస్తూ "మరి నగలు చేయించండి" అనగా, "నువ్వింకా చిన్నపిల్లవు. రెండేళ్లకి బాగా యెదుగుతావు. ఇప్పుడు నీకు నగలు చేయిస్తే అప్పుడు సరిపోవు. కనక రెండేళ్లు వోపిక పట్టు" మన్నాడు. తరవాత నాలుగైదుమాట్లామె "నేను యెదగవలసినంతా యెదిగాను. కనక నగలు చేయించ" మంది గాని "ఇదిగో" "అదిగో" అని అతను మాయ మాటలు చెప్పి కాలం గడిపేశాడు. చివరి కతను పెట్టిన రెండేళ్ల గడువూ దాటే టప్పటి కాపిల్ల పురుడు వచ్చి నెలపురుట్లో చచ్చిపోయింది. నెల తిరక్కుండానే అతను మళ్లీ పెళ్లాడాడు. ఆసందర్భంలోకూడా భావమరుదు లిద్దరూ కొంచెం వాదం చేసుకున్నారు; గాని వర్ధనమ్మా, పూర్ణా కూడా పైకి యేమీ మాట్లాడలేదు.

ఇలాగ మొత్తాని కతనికి యాభై యేళ్లు వెళ్లేటప్పటికి యేడు పెళ్లిళ్లయినాయి. ఏడోపెళ్లి పెళ్లాం యీకాలపు మనిషి. హార్మోనియం వాయించడమూ, గూడకట్టు కట్టడమూ, పక్క పాపిడి తియ్యడమూ, కాఫీ తాగడమూ, సినీమాలకీ నాటకాలకీ వెళ్లడమూ— ఇలాంటి వతని కేమీ సరిపడలేదూ. అయ్యాకి కంగారెత్తింది. అది చూసి వర్ధనమ్మ "రాక్షసుడికి ఇప్పటికి తగినపెళ్లాం వచ్చింది" అనగా, పూర్ణ "మొదణ్ణుంచీ వొక్క విధంగానే రాలిపోయాడు. చివరి కయింది వెధవ పని. దేవుడు లేడూ?" అంది.

సీతారామయ్యా మధ్యమధ్య వుద్రేకంతో వాడి బతుకు విమర్శిస్తూ, "వోరే బావా! హిందూకుటుంబంలో పురుషుని నిరంకుశత్వం యెంత దుస్సహంగా వుందో చూశావా? కర్మకోసం పురుషుడు మళ్లీమళ్లీ పెళ్లాడ నచ్చు నన్న ఋషుల వాక్యా లెలా వికటిస్తున్నాయో చూశావా? స్త్రీల విషయంలో యిలాంటి దుష్పరిణామాలకి కారణా లైన నికృష్టసిద్ధాంతాలు ప్రకటించిన మన భారతదేశం పుణ్యభూమా? పాపభూమా?" అని యిలాగ తీవ్రంగా ప్రశ్నిస్తూ వచ్చాడు గాని జానకిరామయ్యా "తరవాత మాట్లాడుకుందాం" అని జవాబు చెప్పి, "ఈకథలో అతిశయోక్తి వుందా? మన ధర్మాలు చివరి కిలాగ పర్యవసించీ వేనా?" అని తర్కంలో పడ్డాడు.

తరవాత ఆబ్రాహ్మడు తలదువ్వ మంటే ఆపిల్ల అతని బట్టతలకి ఆముదం రాయడమూ, తమలపాకులు మెత్తగా నూరి పెట్టమంటే పెండలపాకులు నూరి నోట్లో పెట్టడమూ, అన్నం మెత్తగా వండమంటే బిరుసుగా వార్చడమూ, ముద్దపప్పు వండమంటే అప్పడాలూ, వొడియాలూ వేయించి వూరుకోవడమూ, చలిమిడీ, చిమ్మిలీ చెయ్యమంటే సెనగలు వేయించి పొయ్యడమూ, చద్దన్నం తినవద్దంటే వుల్లిపాయల పులుసు వండడమూ, పొత్తుపంచె కూడా తడిపి ఆరవేస్తేగాని పనికి రాదంటే వంటిల్లు దాసీదానిచేత బాగుచేయించడమూ, అమావాస్యనాడు వుప్పుపిండి చెయ్యడం బుద్ధిపూర్వకంగా మానేసి, "అయ్యో! మరిచిపోయా నండీ, ఇంట్లో పిండికూడా లేదూ. దాసీకీనుగు చెప్పినమాట వినడం బొత్తిగా మానేసింది. పున్నం మొదలుకొని పోరుతున్నాను గాని గిద్దెడు బియ్యమేనా విసిరిందికాదు. మళ్లీ అమావాస్యకి తప్పకుండా చేస్తాను. ఈవేళకి—కూడక పోతే మజ్జిగతో మాత్రమే తినండి అన్నం" అనీ—ఈ విధంగా అతన్ని నానాతిప్పలూ పెట్టింది. అది చూసి వర్ధనమ్మా, పూర్ణా కడుపులు ఉబ్బిపోయీలాగ నవ్వేరు. సీతారామయ్యా "తగిన పెళ్లాం" అని మెచ్చుకున్నాడు; గాని జానకిరామయ్యా కిక్కురుమన లేదు.

ఇలాగ వొక్కసంవత్సరం గడిచే టప్పటికి ఆ బ్రాహ్మడే చచ్చిపోయాడు. నెలరోజు లేనా తిరక్కుండా ఆపిల్ల వీరేశలింగంపంతులుగారి ఆనందాశ్రమంలో చేరి రెండో నెలలో చక్కని యువకుణ్ణి పెళ్లాడి తనడబ్బూ, జీవితమూ అతనికి ధారపోసింది.

ఆట అయిపోయింది. ఎవళ్ల యింటికి వాళ్లు వెళ్లి పోయారు. వర్ధనమ్మ మేలుకున్నంతసేపూ ఆమొగుడూ పెళ్లాల గొడవలే చెప్పి జానకిరామయ్యని నవ్వించింది. పూర్ణ వర్ధనమ్మ తల్లిని నవ్వించింది. సీతారామయ్య "వదినకి యీకథ కొంచెం ధైర్యం కలిగించవచ్చు" ననుకున్నాడు.

మర్నాడు జానకిరామయ్య పూర్ణతో "వెళ్లిపోదాం" అనగా వర్ధనమ్మ ప్రయాణం సాగనిచ్చింది కాదు. సీతారామయ్య "వెళ్లిపోతా"ననగా రహస్యంగాపూర్ణా, బహిరంగంగా జానకిరామయ్యా, వర్ధనమ్మా, యజమానురాలూ "వల్లకా" దని ఆపేశారు.

మరి రెండుదినాలైన తరవాత ముగ్గురూ బయలుదేరారు. స్టేషనులో టిక్కట్లు కొనేటప్పుడు సీతారామయ్య బలవంతం చెయ్యగా, "ఇప్పటికి పూర్ణని తీసుకవెళ్లు. నేను వారంరోజులలో దాన్ని తీసుకవెళ్లడానికి వచ్చి రెండురోజులు తప్పకుండా వుంటా" నని చెబుతూ, జానకిరామయ్య తనకి యేలూరికే టిక్కట్టు పుచ్చుకున్నాడు. అతను పూర్ణనీ, సీతారామయ్యనీ రాజమండ్రీ స్టేషనులో గేటుదాకా సాగనంపి, "మళ్ళీ శనివారం మధ్యాహ్నం బండిమీద తప్పకుండా వస్తా" నన్నాడు. పూర్ణని కొంచెం యెడంగా పిలిచి, "అత్తతో చెప్పి బావని చీవాట్లు పెట్టించు" అని కూడా చెప్పి వెళ్లి బండిలో కూచున్నాడు.

౬

"బావ పిల్లల తండ్రి అవుతాట్ట" అని సీతారామయ్య చెబుతూ వుండగా పూర్ణ వచ్చి చిట్టెమ్మని కౌగిలించుకుంది. మేనత్తా మేనగోడలూ చూసుకుని అప్పటికి రమారమీ ఆరు మాసా లయింది. ఇద్దరికీ కూడా కళ్లు కాయలు కాసిపోయాయి. "ఎన్నాళ్లకి చూ

శానే పూర్ణా" అంటే "ఎన్నాళ్లకి కనపడ్డావమ్మా అత్తా" అని యిద్దరూ పలకరించుకుని అలా కౌగిలించుకునే వుండి, వెనక్కివెళ్లి, అక్కడ వొక సోఫా వుంటే దానిమీద కూచున్నారు. తరువాత యిద్దరూ ప్రశ్నలతోటీ, జవాబులతోటీ వొక్కగడియ వుక్కిరిబిక్కిరై పోయారు. "సుందరమ్మతల్లి బతికివుంటే యీపాటికి మా అబ్బాయిగూడా పిల్లలతండ్రి అయివుండు"నని చిట్టెమ్మ చెప్పగా, పూర్ణ తాను విన్న సంగతి చెప్పి, "నీకు తెలుసునా? నిజమే?" అని అడిగింది.



"తాతయ్య మండిపడతాడు. నాయనమ్మ గోల పెడుతుంది. బావా నువ్వూ కూడా, యిక మాట్లాడరు. కన్నెత్తిచూడనైనా చూడరు. అయినా నా నాయన మాటకి నే నడ్డుచెప్పను. లోకంలో జరుగుతూ వున్న సంగతులన్నీ చెప్పి వాడు నన్ను వొప్పించాడు. సమర్తాడిన పిల్లనేనా సరే, వితంతువు నేనా సరే, బావ యేపిల్లని పెళ్లాడినా నాకు సంతోషమే. నా కొడుకూ, నా కోడలూ సిరిసంపదలతో పది కాలాలు బతికి నలుగురు బిడ్డల్ని కని పెంచి హాయిగా వుంటే బంధువులు నా యింటికి రాకపోయినా నాకు బెంగ లేదు" అని చిట్టెమ్మ చెప్పగా పూర్ణ ఆశ్చర్యపడింది.

కొంత సేపటికి అత్తా కోడళ్లిద్దరూ గోదావరికి వెళ్లి వచ్చారు. పూర్ణ పైపనులు చేస్తూ వుండగా, "ఏం కూర వండమంటావే? పులుసు చెయ్యనా, చారు కాచనా? లేకపోతే పుల్లని పెరుగు పోగచమంటావా?" అని అడుగుతూనే చిట్టెమ్మ క్షణంలో వంట చేసేసింది. సీతారామయ్య షాపునుంచి పదకొండింటి కింటికి వచ్చి పూర్ణ అందివ్వగా వేన్నీళ్లతో స్నానం చేశాడు. తరవాత చిట్టెమ్మ పూర్ణకీ, సీతారామయ్యకీ యొకబంతిని వడ్డించింది. వారిద్దరూ వేళాకోళా లాడుకుంటూ భోజనాలు మొగలు పెట్టాక చిట్టెమ్మ నట్టివాకట్లోకి వచ్చి, "సూర్యనారాయణమూర్తీ, తండ్రీ! నా మేనగోడలి బుద్ధి మళ్లించు. నాకొడుక్కి దాన్ని చేసుకునే అదృష్టం నాకు కలిగించు" అని మొక్కుకుంది.

ఈసమయంలో "బావకి నెయ్యి కావాలిట అత్తా" అని పూర్ణ పిలవగా, "వదినికి కూర కావాలిటే అమ్మా" అంటూ సీతారామయ్య పిలిచాడు. చిట్టెమ్మవచ్చిచూడగా కూరకావలసి సీతారామయ్యా, నెయ్యికావలసి పూర్ణా యెదురుచూస్తున్నారు. ఆమె వారికిద్దరికీ అవ్వే కాకుండా పులుసులోవున్న వంకాయముక్కలూ, గుమ్మడికాయబద్దలూ, మునక్కాడలూ కూడా వేసి, యెదట కూచుని కబుర్లు మొదలు పెట్టింది.

సీతారామయ్య పెళ్లిగొడవలు వచ్చాయి. "వోరే బావా! మాఅన్నయ్య చెప్పినట్లు నువ్వు పెద్ద ఆస్తిపరుడవు కదా? అందమైనవాడవుకదా? వితంతువుకాకపోతే మంచిపిల్ల దొరకదుట్రా నీకూ?" అని పూర్ణ అడగ్గా సీతారామయ్య అందుకున్నాడు: "బడాయి చెబుతున్నా ననుకోకు. కన్యకలు కావాలంటే లక్షమంది నాకాళ్లమీద పడేసివాళ్లున్నారు. ఇదివరకి-ఈయేణ్ణర్ధంలోనూ పద్ధానుగు సంబంధాలువచ్చాయి. సుందరి పోయిన యేడాది దాకా నాకు పెళ్లిమీదే దృష్టి లేకపోయింది. తరవాత వితంతువుని పెళ్లాడాలని తోచింది. వొకనాడు వీరేశలింగంపంతులుగారి దగ్గిరికి వెళ్లగా ఆసంకల్పాన్ని ఆయన దృఢపరిచారు. ఈ కోరిక మనస్సులో పెట్టుకుని ఎన్ని సంబంధాలు వచ్చినా తిప్పేశాను. తిప్పెయ్యడం నువ్వూ యెరుగుదువు. నా కిప్పుడు ముప్ఫయేళ్లున్నాయి. లోకంలో యెంత వెదికినా పన్నెండేళ్ల పిల్లకంటే పెద్దది దొరకదు. పోనీ, సమర్తాడిన పిల్లని పెళ్లాడ

కూడదా అంటే బ్రాహ్మల్లో అలాంటి పిల్లలు దొరకరు. ఎక్కడేనా వొక ళ్లిద్ద రుంటే నచ్చకపోవచ్చును. పన్నిండేళ్ల కన్య దొరకినా నాకూ ఆపిల్లకీ పద్దెనిమి దేళ్ల తేడా వుంటుంది. మొగుడూ పెళ్లాల మధ్య పదే ళ్ళకంటే హెచ్చుతగ్గు లుండకూడదు. అంటే నా కిప్పు డిరవై యేళ్లేనా వుండే పిల్ల దొరకితే గాని మాయిద్ద రకీ కూడా సుఖం వుండదు. మనస్సులు కలవవు. రుచు లే వేరుగా వుంటాయి. ఇప్పుడు బ్రాహ్మణాళ్ల లో యిరవై యేళ్ళ పిల్ల కావా లంటే వితంతువులే దిక్కు. మనలో వితంతువుల సంఖ్య అనంతంగా వుంది. వారిలో చాలామంది నిజంగా రత్నాలకంటే గూడా మంచివా ళ్లున్నారు. కొందరు వైరాగ్యంతో కాలం గడుపుతూ వున్నా, కొందరు అక్రమమార్గాల్లో ప్రవర్తిస్తూ వున్నా, అగ్నిహోత్రం లాంటివాళ్లు అనేకమంది వున్నారు. వాళ్ళందరూ ప్రేమ అంటే యేమిటో, సంసారసుఖం యెలాంటిదో, జీవితానందం యెంత విలవైనదో, దాంప త్యంలో యెంత పావిత్ర్యం వుందో, ఈజీవితం యెంత గొప్ప దుర్లభపదార్థమో బాగా తెలిసి, తమ కా అదృ ష్టం లేనందుకూ, తమకు అట్టి నికృష్టదశ సంభవించినం దుకూ విచారిస్తూ, ఉత్తరజన్మలో నైనా చాలాకాలం అనుకూలభర్తలతో సుఖపడా లని తపస్సు చేస్తూ కాలం గడిపేవాళ్ళు వేలూ, లక్షలూ వుంటారు. అలాంటివాళ్ళలో సాహసం వున్న రత్నాన్ని యేరి పెళ్లాడితే ఎంత సుఖమో, ఎంత పరమార్థమో, ఎంత పుణ్యమో ఆలోచించూ. ఇదీగాక, మన బ్రాహ్మల్లో ప్రేమించడం యెలాగో తెలుసుకో డానికి వితంతువులకు మాత్రమే అవకాశా లున్నాయి. కన్యకలకు ప్రేమ యిలాంటి దని తెలవని స్థితిలోనే పెళ్లి అయిపోతుంది. తరవాత ఆపిల్లకీ ఆపిల్లవాడికీ కలిస్తే కలుస్తుంది, లేకపోతే లేదు. వితంతువివాహంవల్ల ఈచిక్కులు కలగవు. వయస్సు సంబంధించిన హెచ్చు తక్కువల బాధ వుండదు. నేను వితంతువునే పెళ్లాడా లని నిశ్చయించుకోడానికి కారణా లివీ. నాపుణ్యంవల్ల చాలా కష్టంమీద నైనా మాఅమ్మ యిందు కంగీకరిం చింది. నలుగు రైదుగురు వితంతువులు నాదృష్టిలో వున్నారు. వొకామె యింకొకణ్ణి వరించింది, వొకతె అంగీకరించేలాగ కనపడింది కాని వాకబు చెయ్యగా చాలా పెంకిమనిషి అని తెలిసింది. వొకామెని మద్రా సులో చూశాను; ఆమె తల్లిదండ్రులతో మాట్లాడాలనే మొన్న కాకినాడ వచ్చాను; గాని పిల్లసంగతి చూడగా ఆమె మొగుడులాగా, నేను పెళ్లాంలాగా మసులుకో వలసి వుంటుందని తోచింది. ఇక బందరులో వొకామె వుంది. అన్నీ బాగానే వున్నాయి; గాని తల్లిదండ్రుల కేకసంతానం. అల్లుణ్ణి యిల్లరికం తెచ్చుకోవాలని వారి సంకల్పమట. అది నాకు సరిపడదు. ఆషరతు వారు వొదులుకుంటే ఆమెను పెళ్లాడవచ్చును. మొన్న మా అమ్మకూడా చూసిం దామెని" అని సీతారామయ్య చెప్పగా, "పిల్ల అన్నివిధాలా బాగుందే. ఇల్లరికం చిక్కు లేకపోతే మాఅబ్బాయికి చేసుకుంటా నని నే ననగా 'యింటికి వెళ్లి ఆలోచించి రాస్తా' నని పిల్ల తండ్రి చెప్పాడు" అని చిట్టెమ్మ చెప్పింది. తరవాత మాట్లాడవలసిన వంతు పూర్ణకి వచ్చింది; గాని ఆమె మాట్లాడలేకపోయింది. అది వుత్సాహమో, ఆందోళ నమో, తహతహో, బెంగో, బిడియమో, ఉద్రేకమో, బ్రమాన్పాటో యేదో ఆమెని స్తబ్ధురాలుగా చేసేసింది. సీతారామయ్యా, చిట్టెమ్మాకూడా అది కనిపెట్టి కళ్లతో యేమిటో చెప్పుకున్నారు; గాని ఆసంగతి పూర్ణ యెరగదు.

౨

భోజనా లయినాయి. తాపితాపంచె విడిచి, గ్లాస్గోమల్లు కట్టి, సిల్కుషర్టు తొడుక్కొని, తాంబూ లం వేసుకోడానికి సీతారామయ్య పాందాను తీసికొని రాగా, పూర్ణ "నేను చిలకలు చుట్టి యిస్తాను తేరా బావా" అంటూ ఆపాందాను పుచ్చుకుంది. తరవాత యిద్దరూ పడమ టింటోకి వెళ్లి చిట్టెమ్మ భోజనం చేస్తూవుండగా ఆమె యెదురుగా కూచున్నారు. పూర్ణ పాందాను తెరిచి తమలపాకులు తియ్యగా చిట్టెమ్మ కబు రందుకుంది—

"ఇక మాయిల్లు తొక్కి చూడవు కామా కోడలా?"

"చూశావురా బావా, మీయమ్మ యిక రావద్దం టోందీ?"

"ఉన్నమాటంటే వులుకెక్కువట."

"ఇప్పు డేం వచ్చిందీ?"

"అంతానూ—"

"ఏం?"

"నేను వితంతువివాహం చేసుకుంటే నిజంగా నువ్వు మా యింటికి వస్తావా?"

"రానని నిశ్చయం యేమిటే?"

"బావ చెప్పిన మాటలు జ్ఞాపకం వున్నాయా?"

"చివరికి మా వాళ్లుగూడా అంగీకరిస్తారేమో!"

"లేకపోతే రావు కదూ?"

"ఆమాట అనకు"

"ఏమన మంటావు కోడలా, మరి?"

"మేంవచ్చినా రాకపోయినా పిలవడంమీవంతు."

"మేము పిలిస్తే? తరవాతా?—"

"రావడం మా వంతు."

"అంటే యిందులో వొకటి జరిగితే రెండోది కూడా జరుగుతుం దన్నమాట."

"మూడు వంతులు—"

"రాకపోడాని కా కాస్త సందూ చాలు."

"ఇంతెందుకూ? నే నిక్కడ యింకా వారంరోజు లుంటానుకదా! ఈలోపుగా నువ్వు పెళ్లాడు: నేను వుంటానో వుండనో చూద్దువుగానీ."

"నిజంగా?"

"తరవాత యేం జరిగినా ఆ మహోత్సవంలో నా వంతు అనుభ వించే—"

"సెబాస్. అదీ మాట. కోడలా! కోట్లు వెలగలమాట చెప్పావు. నువ్వు ఆమాత్రం ధైర్యం చెబితే మా కింక లేని దేమిటే? ఇక నీదే లోటురా నాయనా."

"అవునా వొదినా?"

"ముమ్మాటికీనీ."

"ఆమాటమీద వుండు. తాంబూలం యేదీ?"

సీతారామయ్య చెయ్యి చాపగా మందహాసం చేస్తూ పూర్ణ వక్కలూ, చిలకలూ అతని కందించింది. సీతారామయ్య తల్లి కేసి చూసి చిరునవ్వు నవ్వుతూ తాంబూలం వేసుకున్నాడు.

"నువ్వుకూడా వేసుకోవే అమ్మా. ఇక్క డెవ్వరూ చూడరు లే."

"ఔనే వదినా! మూ డాకులు వేసుకో."

"అదివరకు లేదు గాని వదిన కాపరానికి వచ్చాక చాలా మాట్లు బలవంతం చేసింది. తాతయ్య వూళ్లో లేనప్పుడెప్పుడేనా మూ డాకులు—అదేనా నాయనమ్మకి తెలవకుండానూ—మా అమ్మ వేసుకోమనే అంటూ వుంటుంది. నాకే సందేహం. వొకమాటు అన్నయ్య చూశాడు. ఏ మంటాడో బాబూ అని భయపడ్డాను గాని చూసీచూడ నట్లు మాట్లాడకుండా చక్కాపోయాడు. పాపం, వాళ్ల నాన్న నెల్లూరులో వుద్యోగం చేసినప్పుడు వదిన చూసిందిట. అక్కడ వితంతువులు కూడా మంచికుటుంబాల్లో తరుచు తాంబూలం వేసుకోవడం వుందిటే అత్తా!"

"ఔనుట నువ్వుకూడావేసుకో అమ్మా!"

"నాకు నువ్విచ్చావు కనక నీకు నే నిస్తాను తాంబూలం. ఏం వదినా?

"ఇవ్వరా నాయనా!"

వెంటనే సీతారామయ్య తమలపాకులు తుడిచి, సున్నం రాసి, చిలకలు చుట్టి అందించాడు. పూర్ణ అవి పుచ్చుకుంది; గాని "చూశావుటే అత్తా, బావ చుట్టిన



చిలకలు యెంత వంకరటింకరగా వున్నాయోనూ?" అని వేళాకోళం చేసింది.

"చిలకలు చుట్టి యివ్వడం ఆడది చెయ్యవలసిన పని కాదుటే వెర్రిదానా? నీమీద వుండే ఆదరంచేత చుట్టి యిచ్చాడు; గాని బావ కేం చేత నౌనమ్మా?" అని చిట్టెమ్మ చెప్పింది.

ఇలాగ అరగంట అయేటప్పటికి చిట్టెమ్మ లేచింది. "ఇక షాపుకి వెడతానే వదినా" అంటూ సీతారామయ్య లేచాడు. "ఎనిమిదైతే గాని రావు కామోసు" అని పూర్ణ అనగా, చిట్టెమ్మ "ఇవాళ తొరగా రారా నాయనా" అంది. "మామూలుగా యెనిమిదింటికి వస్తాను. నువ్వు ఇక్కడ వున్నన్ని రోజులూ ఆరింటికే వస్తానులే" అని బదులు చెప్పి సీతారామయ్య వాకట్లోకి వెళ్లాడు. చిట్టెమ్మ "రాత్రి కేమీ కూరలు లే"వంటూ అతని దగ్గిరికి వెళ్లి, "అయిదుగంటలికి మల్లిమొగ్గలు పొట్లం కట్టి పంపు" అని రహస్యంగా చెప్పింది. సీతారామయ్య కళ్లతో జవాబు చెప్పి వెళ్లి పోయాడు.

౨

వొంటిగంటకి చిట్టెమ్మకి పని ముగిసింది. మేనత్తా, మేనకోడలూ వీధితలుపులు బిగించి వచ్చి వాకట్లో వున్న సోఫామీద కూచున్నారు. విశాలమైన మండువాలో నుంచి తీక్ష్ణమైన చైత్రమాసపు యెండ కడపరాళ్లతో చప్టా చేసిన వాకట్లో పడుతోంది. అది చూసి జ్ఞాపకం రాగా చిట్టెమ్మ "విజయదశమికి వోమాటు యెండవేశాను సుందరమ్మ చీరలు. మళ్లీ వోమాటు యివాళ యెండవేద్దామా?" అనగా పూర్ణ "అలా చేస్తేనే మంచిదీ" అంది. తరవాత యిద్దరూ లేచి చప్టామీద జపాన్ తుంగచాపలు పరిచి, బీరువాలో వున్న చీరలన్నీ తెచ్చి, దులిపి, చాపలమీద పెట్టారు. తరవాత చిట్టెమ్మ బీరువా దులుపుతూ వుండగా రైకలన్నీ పూర్ణ వొక్కర్తే పరిచింది. చీరలు రమారమీ యిరవైదాకా వున్నాయి, వుప్పాడవైతే నేమి, బనారసువైతే నేమి, బెంగుళూరువైతే నేమి, మధురవైతే నేమి, పునహావైతే నేమి, పుల్లంపేటవైతే నేమి, జపానువైతే నేమి-అన్నీ జరీ ముద్దలు. వొక్క చీర కూడా నలిగిపోకుండా అప్పుడు షాపులో నుంచి తెచ్చినట్లున్నాయి. రైకలు కూడా అన్ని రకాలూ, వాట్లకి తగిన విలవగలవి, ఉన్నాయి. "అన్నట్లు మరిచిపోయా" నంటూ లేచి మళ్లీ యింట్లోకి వెళ్లి చిట్టెమ్మ రెండు డజన్ల పట్టు చేతిరుమాళ్ళు తెచ్చి, "ఇవి దానికోసం యిక ఆరు మాసాలికి పోతుం దనగా కొన్నాడు మా నాయన. ఇందులో యే నాలుగైదో తప్ప తతిమ్మావి మడతే విప్పలేదు సుందరమ్మ" అని చాపమీద వేసింది.

మళ్లీ యిద్దరూ సోఫామీద కూచున్నారు. చిట్టెమ్మ సుందరమ్మకి పుట్టింటివారు పెట్టిన వేవో, తాము కొన్న వేవో వివరించి చెప్పగా, పూర్ణ "అన్నీ మూడువేల ఖరీదు వుంటాయి. ఏమే అత్తా?" అని అడిగింది. "వీట్లలో పాతిక రూపాయలకి తక్కువ విలవ అయినదీ, రెండువందల యాభైయింటికి ఎక్కువైనదీ లేదు. పాతికవందలకి తక్కువ ధర వుండదు" అని చిట్టెమ్మ చెప్పగా, పూర్ణ గుండెలమీద చెయ్యి వేసుకుని, "అమ్మబాబోయి! చీరలే యింతైతే నగ లెంత వుంటాయో? కాని పాపం సుందరక్కయ్యకి యోగం లేకపోయింది" అని విచారించింది. దానిమీద "నగలు కూడా వోమాటు చూద్దాం రావే అమ్మా" అని చిట్టెమ్మ ముందు దారి తియ్యగా, "పద" అంటూ పూర్ణ వెనక్కాలే వెళ్లింది.

"ఆయినపెట్టె బావది. ఇది సుందరమ్మది. దాని నగలకోసమూ, వెండిసామానుకోసమూ ఇది పుట్టింటివారే యిచ్చారు. అది పోయాక వారు పెట్టిననగలూ, చీరలూ, ఈపెట్టే, ఆబీరువా, ఆమంచమూ, తతిమ్మా సామానూ పట్టించుకుని వెళ్ళవలసిం దని యెంతమంది చేత యెన్నిమాట్లు ఎన్నివిధాల కబురంపినా 'మాఅమ్మాయితో పాటు ఆవస్తువులు మీ కిచ్చేశాం. అవి మావి కావు. మేం చేసుకున్న పాపంవల్ల మా అమ్మాయి మమ్మల్ని విడిచి వెళ్లిపోయింది; గాని మా అల్లుడున్నాడు. ఆవస్తువు లన్నీ అతనికి చెందవలసినవే.

అతను మళ్లీ యింకో పిల్లని పెళ్లాడి ఆపిల్ల ఆవస్తువులు వాడుకుంటే ఆమెని మాసుందరమ్మ అనే భావించుకుంటాం' అని మళ్లీ కబురంపారు" అని చెప్పి పెట్టి తెరిచి, వొక్కొక్క వస్తువే పైకితీసి చాపలో పెట్టింది. అందుకు "చాపమీదవద్దు. వుండవే అత్తా" అని చెబుతూ పూర్ణ లేచి సీతారామయ్య తువ్వాలు తెచ్చి పరిచింది.

వస్తువు లన్నీ చూశా టప్పటికి యిద్దరికీ కూడా కళ్లు చెదిరిపోయాయి. పచ్చని బంగారంమీద యెర్రనివీ, తెల్లనివీ రాళ్లూ, ఆణిముత్యాలూ ధగధగ మెరిసిపోతున్నాయి. "ఇవి దుద్దులు. పద్ధానుగు రాళ్లూ పద్ధానుగు వందలకి కొన్నాడు నాయన. ఈవొడ్డాణానికి మజూరీ ప్రత్యేకం రెండువంద లయింది. ఈవంకీల రాళ్లు యెనిమిదివందలకి కొన్నాడు. జడ చూశావా, యెంత బాగాచేశాడో పనివాడూ! కాసుకి అయిదుకాసుల రకం కూడా మోటని సుందరమ్మ పదికాసుల రకం చేయించుకుంది పౌరీ కట్టుకాసుల పేరు. పాము మీసంలాగ యెంత నాజూకుగా వుందో చూశావా?" అంటూ యిలాగ చిట్టెమ్మ వాట్లని వివరించి చెప్పింది. పూర్ణ "ఎంత బాగుందో", "ఎంత మెరసిపోతోందో", "ఎంత చక్కగా వుందో", "ఔను", "మరే", "దేవుడు చూడలేకపోయాడు", "అంతే", "బతికి వున్నంతకాలమూ దివ్యభోగం అనుభవించింది" అని యిలాగ సమాధానాలు చెబుతూ, వొక్కొక్క వస్తువే తీసి కళ్ల కద్దుకుని, "నన్నిలా మోడుగా చేసెయ్యకపోతే నా ఆయు వంతా సుందరక్కయ్యకి పొయ్యగూడదూ ఈశ్వరుడూ" అంది. చిట్టెమ్మ తరవాత కంచమూ, గిన్నెలూ, సాసర్లూ, కోపాలూ, స్పూనులూ, పన్నీరుచెంబూ, గంధపుగిన్నీ, పళ్లెమూ వగైరా వెండిసామాను కూడా చూపించి, "యివి రెండుమళ్లు వుంటాయి" అంది. వాట్లని చూసి కూడా పూర్ణ చాలా ఆనందించి, "అక్కయ్యకి యోగం లేకపోయింది" అని మళ్లీ అంది. తరవాత వొక్కొక్క వస్తువే పూర్ణ అందించగా చిట్టెమ్మ పెట్టిలో పెట్టి, ఒక్క గడియమాత్రం వేసింది. "తాళం వెయ్యవా" అంటే "ఆనక వేస్తానులే" అంది.

తరవాత యిద్దరూ ఫోనోగ్రాఫుదగ్గిరికి వెళ్లారు. చిట్టెమ్మ ప్లేట్లు పైకి తియ్యగా పూర్ణ తన కిష్టమైనవి యేరి పాడించింది. ఇలా వొకఅరగంట గడిచాక ఫొటోల దగ్గిరికి వెళ్లారు. చిట్టెమ్మ తానూ భర్తా వున్న పటమూ, తన ఆడపడుచుపటమూ, తాను ఒక్కత్తీ ఉన్న పటమూ, తను లక్షవర్తివ్రతం చేసుకునే టప్పుడు తీయించిన పటమూ—ఇలాంటివన్నీ ముందు చూపించి తరవాత కొడుకూకోడళ్ల పటాల దగ్గిరికి తీసుకువెళ్లింది. వొక పటంలో సీతారామయ్య కుర్చీమీద కూచోగా సుందరమ్మ కుర్చీపట్టుకుని నుంచునివుంది. ఇంకోదాంట్లో సుందరమ్మ కూచునీ, సీతారామయ్య నుంచునీ వున్నారు. వొకదాంట్లో సుందరమ్మ యీజీచెయిరుమీద కూచుని వుండగా సీతారామయ్య కింద కూచుని వున్నాడు. వొకదాంట్లో ఇద్దరూ నుంచుని వున్నారు. ఇంకోదాంట్లో ఇద్దరూ చదరంగం ఆడుతున్నారు. మరోదాంట్లో గవ్వలాడుతున్నారు. ఇంకోదాంట్లో సీతారామయ్యకి సుందరమ్మ తాంబూలం యిస్తోంది. ఇలాగ వారి ఫొటోలు అనేకరకాలు వున్నాయి. వాట్ల నన్నింటినీ చూపించిన తరవాత చిట్టెమ్మ "హాల్లో వున్న సుందరమ్మ పెద్దపటం చూశావు కాదా?" అంటే పూర్ణ "చూశా" నంది.

౬

అప్పటికి నాలు గయింది. చీరలమీద యెండ పోయింది. ఆసంగతి చెప్పి పూర్ణ "చీర లిక దాచేద్దాం" అనగా చిట్టెమ్మ ఆమెని దగ్గిరిగా తీసుకుని, "నాబిడ్డా! వొక్క మాట చెబుతాను వినవూ?" అంది.

"వినకేం?"

"విన కే మంటే చెవులతో మాత్రమే కాదు వినడం; అలా చెయ్యాలి."

"ఏమిటో చెప్పూ."

"చేస్తా నను."

"నీమాట తీసేస్తానా? అదేమిటో చెప్పూ."

"నీకు వీలు లేనిమాట చెబుతానా? వింటా నను."

"సరే."

"ఏమీ లేదే నాకూనా! నావి పాడుకళ్లు కాకపోతే నా కిలాంటి యోగం పట్టదు. దిక్కుమాలింది, ఏమీ లేనిదే మానాయన తండ్రికీ, మీనాయనకీ మాట పట్టింపులు వచ్చాయి. ఆపట్టింపులు రెండేళ్లు వుండిపోయాయి. ఆరెండేళ్లూ రాజమహేంద్రవరంకాకి యేలూరులోనూ, యేలూరుకాకి రాజమంహేంద్రవరంలోనూ వాలలేదు. ఆసమయంలోనే నీకు మీ నాన్న పైసమ్మంధం కుదిర్చాడు. ఆముహూర్తానికే మానాయన పెళ్లి చెయ్యాల లని మావారు సుందరమ్మని కుదిర్చారు. ఏలూరులోనూ, బెజవాడలోనూ వొకటే లగ్నంలో మీ పెళ్లిళ్లు అయిపోయాయి. తరవాత సుందరమ్మ అర్ధాయుష్యపు చావైనా మొన్నటిదాకా అనుభవించింది. కాని, కసలే లేకపోయిందే నాతల్లీ. ఎనిమిదో యేట పెళ్లీ, పదకొండో యేట గంగాప్రవేశమూనూ. రామరామా, గుండెలు చెరువై పోతున్నాయి. పరికిణీలమీదే గాని కోకలమీద నిన్ను చూడడానికి యోగం లేకపోయింది. సుందరి చక్కదనం నీచక్కదనంలో యేమూలకమ్మా? కాని అంతా అడివిలో కాచిన వెన్నెలలాగ అయిపోయింది. అయినా ముసలిదాన్నయిపోతున్నాను. ఇంకెన్నాళ్లో బతకను. బతకాలని కూడా లేదు. నా తండ్రికి పెళ్లయి వొక్క బిడ్డ పుడితే చాలు. తరవాత సంతోషంతో వెళ్లిపోతాను. వెధవరికం వచ్చినా నా కన్ని ముచ్చటలూ తీరాయి. రెండుమాత్రం తరవాయి. మొదటిది వొక్క కూతురేనా లేకపోవడం. రెండోది నువ్విలా అయిపోవడం......అమ్మా! చెప్పవచ్చిందేమీ లేదూ. వీధి తలుపులు వేసే వున్నాయి. ఇక యీవేళకి తియ్యను. బ్రహ్మభేద్యం. వొక్కమాటు— వొక్కక్షణం వాట్లలో యిష్టం వచ్చిన చీరా, రైకా ధరించి, నగలు పెట్టుకుని, యీపాడుకళ్ళకి— యీ దరిద్రపు కళ్ళకి—దించుకుపోవలసిన యీకళ్ళకి వెలుగు చూపించవూ తల్లీ? మా అమ్మవు కామూ? లే అమ్మా వొక్కక్షణం అలా వుంటే చాలు. తరవాత—తరవాతా— నా చిట్టి తల్లివి కామూ? నాబంగారు కొండవు కాదూ?" అంటూ కళ్ళల్లో నీళ్ళు పెట్టుకుంటూ అడిగింది. దాని మీద పూర్ణకి యేడుపు వచ్చింది. ఆదుఃఖం వుబ్బెత్తుకొని రావడంచేత మాట వచ్చింది కాదు. అది గ్రహించి చిట్టెమ్మ అమెని పాదిని పట్టుకుని, "మాఅమ్మా! ఏడవకు నేను కటికికీనుగుని. కానైతే యిది మంచి కోరిక కాదు; కాని నిన్ను దుఃఖపెట్టాలని కోరలేను. నువ్వు పుణ్యస్త్రీవేషంలో వుండగా వొక్కమాటు చూస్తే యిక నాకు కూతుళ్ళు లేని బెంగ వుండదు. నువ్వు నా కోడలివే అని ఆనందిస్తాను. లే తల్లీ! లే మా అమ్మ నువ్వు ఆగదిలోనే వుందువు గాని, యివతలికి రానే వద్దూ. మాఅమ్మవు కాదూ?" అని వోదార్చింది.

తరవాత పూర్ణ దుఃఖం కొంచెం తగ్గిందని గ్రహించి చిట్టెమ్మ సందిట పట్టుకుని లేవతియ్యగా, ఆమె అడ్డు చెప్పకుండా లేచి నుంచుంది. గదిలోకి తీసుకు వెళ్లగా మాట్లాడకుండా వెళ్ళింది. దానిమీద, "నాతల్లే! నాఅమ్మే! మేనత్తనైనందుకు మాట తీసెయ్యకుండా—ఇక్కడ కూచో తల్లీ నువ్వు" అంటూ ఆమెని నిలువుటద్దం యెదట కూచోపెట్టి, అగరునూనీ, దువ్వెన్నా తెచ్చింది. వాట్లని చూసి పూర్ణ "తలగూడా దువ్వుతావా అత్తా?" అనగా చిట్టెమ్మ "నాతల్లివి కామూ? ఇక దేనికీ అడ్డు చెప్పకమ్మా నువ్వు" అంది. అప్పుడు పూర్ణ మళ్లీ కళ్ళమ్మట నీళ్ళు తెచ్చుకుని చిట్టెమ్మ వొడిలో చేరబడి, "అత్తా! నువ్వేం చేసినా సరే. నన్ను బావకిమాత్రం చూపించకు" అంది. "నీ కిష్టం లేకపోతే ఆలాగే లే అమ్మా" అంటూ చిట్టెమ్మ ఆమె తలకి నూని రాసింది.

వొక్క క్షణంలో నాగరం పెట్టి వాలుజడ వెయ్యడం అయిపోయింది. తరవాత నీళ్లు తెచ్చిపూర్ణని సబ్బుతో మొగం కడుక్కో మని సీతారామయ్య కండువాతో తుడిచింది.

"వాట్లలో నీయిష్టం వచ్చిన చీరా, రవికా తీసుకో తల్లీ!"

"నీయిష్టం"

"నాయిష్టం కాదు నీయిష్టం. వాట్లలో అన్ని రంగులూ, అన్నిరకాలూ వున్నాయి. తీసుకో అమ్మా!"

"నీముచ్చటకోసం నేను ఈవేషానికి వొప్పుకున్నాను. నీకళ్ళకి ఏవి బాగుంటే అవి తే."

"అలా అయితే నాకళ్ల కివి నచ్చాయి."

ఇలా చెబుతూ చిట్టెమ్మ జరీ పువ్వులు గల వూదా బనారసు చీరా, జరీచార లున్న ఆకుపచ్చని దక్షిణాది రవికా తీసి చేతి కివ్వగా, పూర్ణ అందుకుని, "సరిగా నాకు మనసైనవి తీశావు. నాకు కట్టుకునే యోగం లేకపోయినా వూదాచీర అంటే యిష్టం. అంచేత పోరి మాఅన్నయ్యచేత మావదినకి ఇలాంటిచీరే కొనిపించాను. నాముద్దు తీర్చడం కోసం మావదిన మాయింటో వున్న ప్రతీ పండుక్కీ 'ఏచీర కట్టుకోమంటా' వని నన్నడగడమూ, నేను 'వూదాచీర' అని చెప్పగానే, పాపం,మారుచెప్పకుండా—సంతోషిస్తూనే ఆచీర కట్టుకోవడమూ జరుగుతూ వుంటుంది. నువ్వు సరిగా నా రుచి కనిపెట్టావు" అని చెబుతూ వాట్లని ధరించింది.

తరవాత చిట్టెమ్మ పూర్ణని సుందరమ్మ యినప పెట్టిదగ్గిరికి తీసుకు వెళ్ళి వొక్కొక్కటే పుదుచ్చేరి నానూ, గజ్జెల పట్టెడా, పుస్తెల నానూ, కట్టుకాసుల పేరూ, చంద్రహారమూ మెడలో వేసింది. చేతులికి రెండుమూడు జతలబంగారుగాజులూ, నాగపురివంకీలూ తొడిగి యెడమచేతి అనామికకు సుందరమ్మ రవ్వల వుంగరం పెట్టింది. అది పూర్ణకి సరిగా సరిపోగా, "మా అమ్మే, మాతల్లే, ఇది నీకోసం చేయించినట్లే సరిపోయిం" దని చిట్టెమ్మ చెప్పగా పూర్ణ ఆవుంగరాన్ని చూసి మందహాసం చేసింది. తరవాత ఆవిడ చెవులికి కమలాలూ, ముక్కులికి ముక్కుపుడకలూ పెట్టి, చంప సరాలు తగిలించింది. కాలివేళ్లకి మట్టెలూ, కాళ్ళకి పాంజేబు గొలుసులూ పెట్టింది. నడుముకి గజ్జెల వొడ్డాణం పెట్టి, జడకి బంగారపు జడ కట్టింది. కళ్ళకి సన్నంగా కాటుకా, నుదుట సెనగబద్దంత చుక్కాకూడా పెట్టి, "ఇది చేత్తో పుచ్చుకో" అని పట్టుచేతిరుమాలిచ్చింది.

చిట్టెమ్మ యిలా అలంకరిస్తూ వుండగా పూర్ణ "యెవ రేనా వస్తా రేమో" అని పదిమాట్లంది. దానికి చిట్టెమ్మ "వీధి తలుపులు వేసే వున్నాయి కదూ? వొక వేళ తలుపులు తియ్యవలిసివచ్చినా వచ్చిన పనేమిటో హాల్లోనే అడిగి అక్కణ్ణించే పంపేసి మళ్లీ తలుపులు బిగించేస్తాను" అని పదిమాట్లూ జవాబు చెప్పింది.

అలంకారం పూర్తి అయిన తరవాత చిట్టెమ్మ పూర్ణని వసారాలోకి తీసుకు వెళ్ళి చూడగా పూర్ణ అప్సరసలా వుంది. "నాతల్లి నాకోరిక తీర్చింది. నా



మేనగోడలు కనక నామాట తీసెయ్యకుండా — నాకూనా! లక్ష్మి, సరస్వతీ, పార్వతీ కూడా అందానికి నీకు సాటిరారు. తల్లీ, ఇంత సౌందర్యం యిచ్చినదేవుడు నిన్ను వితంతువుగా చేస్తాడా? నీకు అలాంటి గతి మనుష్యులు కల్పించింది కాని దేవు డేర్పరిచినది కాదు. ఇప్పుడు నిన్ను చూస్తే నీకు మొగుడు లేడని యెవ ళ్ళన గలరూ? నిండుచంద్రుడులాంటి నీముఖంమీద అలాంటి అయిదువుతనం మెరిసిపోతూ వుండగా నీకు వైధవ్యం అంటే యేమిటి నామాటా! ఈ చీరా, ఈరవికా, ఈనగలూసుందరమ్మకి కంటే నీకు బాగున్నాయి. ఏదీ? వొక్క

మాటు యిలా చూడు కోడలా? నా కళ్లకి నే డెంత వెలుగు ఐచ్చిందే? అమ్మా! వొక్కక్షణం యిలాగే వుండు. నువ్వెవ్వరికీ కనపడవు. దేవతలు కూడా నిన్నిప్పుడు చూడలేరు. ఇంకొక్క లో టుంది. ఎవరి నేనా బజారుకి పంపి మల్లి —"

చిట్టెమ్మ యిలా చెబుతూ వుండే సమయంలో "అమ్మా" అని సీతారామయ్య తలుపు తట్టాడు. దాని మీద "బాబోయి బావ వచ్చాడు. తలుపు తియ్యకే అత్తా" అంటూ పూర్ణ కౌగిలించుకోగా, చిట్టెమ్మ "బావకి తలుపులు తియ్యకపోతే యెలాగ తల్లీ? నీ కిష్టం లేకపోతేయీగదిలోకి రానివ్వనులే.భయపడకు"అని వోదార్చింది కాని పూర్ణకి నమ్మకం కలగలేదు. "వొద్దే అత్తా తలుపు తియ్యకే.బావ యీగదిలోకి తప్పకుండా వస్తాడే. నే నిలా వుండగా చూస్తే వెక్కిరిస్తాడే. నామాట వినవూ?" అని ఆమె మల్లీ చెప్పగా, చిట్టెమ్మ "భయం లే దమ్మా! నామాట నమ్మ. బావకి నిన్ను కనపడనివ్వనులే. వొకవేళ బావ నిన్ను చూస్తే మాత్రం నీ అందాన్ని చూసీ, ఆపాడువేషం తీసేసి నువ్వు ఈమంగళవేషం వేసుకున్నందుకూ బ్రహ్మానందపడతాడు; గాని వొక వితంతువుని పెళ్లాడి ఆమె కిలాంటి వేషం వేయించాలని ముచ్చటపడుతూ వున్నవాడు ని న్నెక్కిరిపిస్తాడా? భయపడకమ్మా! నీకేమీ ఫరవా లేదు" అంటూ ధైర్యం చెప్పి, తలుపులు తీసి, సీతారామయ్య యింటోకి వచ్చాక మల్లీ వేసేసింది.

"వదిన యేదే?"

"ఇంటో వుంది నాయనా!"

"ఏం చేస్తోందీ?"

"ఏమీ లేదూ."

"ఈచీర లన్నీ యిక్కడ వున్నా యేం?"

"ఆరవేశానురా"

"ఇంకా తీశావుకాదేం?"

"చెయ్యి వూరుకుంది కాదు."

"ఏం చేస్తున్నా వేమిటి?"

"వొక పనేమిటే? ఆపొట్లం యేమిటోయీ?"

"మల్లెపువ్వులూ, దండలూనూ."

"ఇలా తే. ఎందుకు తెచ్చావూ?"

"వేసుకోడానికి; అలా అడిగా వేమే అమ్మా?"

"నా కిప్పుడు మల్లి పువ్వుల పని వచ్చింది. నువ్వు చెప్పినట్లు తెచ్చావు."

"ఆ పనేమిటే అమ్మా?"

"రేపు చెబుతాను లే."

తరవాత తల్లి, కొడుకూ వొక్క క్షణం కళ్లతో మాట్లాడుకున్నారు. అప్పుడు చిట్టెమ్మ "ఇంటోకి రాకురా నాయనా" అంటూ గదిలోకి వెల్లి లోపల గడియ వేసింది.

"అమ్మయ్యా; బావ లోపలికి వస్తాడేమో నని నాగుండె బేజారై పోయింది."

"నేను వద్దంటూంటే వస్తాడా అమ్మా అలాగా? నాకొడుకు అంత మోటవా డనుకున్నావా? నాకొడుకుని నేను మెచ్చుకోవడం కాదు. నా కొడుకులాంటి వాడు పృథివిమీద వున్నాడా? మీ నాన్నకి పనికి వచ్చాడు కాదు గాని అలాంటి పెల్లికొడుకు కోట్లు కట్నం యిచ్చినా దొరుకుతాడా? వాడు మొన్నటి దాకా మీతోపాటు ఏలూరులో మీయింటోనే పెరిగాడు కనక వాడిమనస్సు యెంత మంచిదో నీకు తెలిసే వుంటుంది."

చిట్టెమ్మ యిలా చెప్పి పొట్లం విప్పి నాలుగైదు మొగ్గలు పూర్ణ తలలో పెట్టి సోఫామీద కూచుని ఆమెని దగ్గరగా కూచోపెట్టుకుంది.

"బావ వొక్కడూ వున్నాడే పాపం వాకట్లోనూ!"

"నూతిదగ్గిరికి వెళ్లాడు కాళ్లు కడుక్కోడానికి. పోనీ వోమాటు —"

"బాబోయి!"

"ఏం తల్లీ?"

"వొద్దు బాబూ!"

"నాకళ్లు చల్లబడ్డట్టే నాకొడుకు కళ్లుగూడా చల్లపడవొద్దూ? నేను దగ్గిరదాన్నీ, బావ దూరపువాడూనా నీకూ? నిన్ను చూస్తే బావ కెంత ఆనందం?

అందులో యిప్పుడు చూశాడంటే యిక పొంగిపోడూ? వొక్కమాటు చూడని య్యమ్మా!"

"బావకళ్ల పడి నేను నుంచోలేను బాబూ."

"పోనీ కూచో అమ్మా! నామాట విను. వొక్క మాటు బావ ముచ్చటకూడా తీర్చు నాతల్లీ! ఏ మమ్మా!"

"ను వ్వింటాకా బావకి చూపించ నన్నావూ మరీ?"

"నీ కిష్టం లేకపోతే యిప్పుడూ చూపించనూ. వొక్కమాటు చూడని య్యమ్మా. చూస్తాడు, వెళ్లిపోతాడు. అంతే. నుంచోనివ్వనులే నేను. నీ కిష్టం లేకపోతే పలకరించనివ్వను కూడాను."

"............"

"ఏం తల్లీ? నామాట వినవూ?"

"..............."

"మాట్లాడవటే నాకూనా?"

"..............."

"తీసుకు రానా?"

"వొద్దంటే నీకు కోపంవొస్తుంది."

"తప్పా అమ్మా? బావ చెడిపోయాడా?"

"మరి-అయితే చూడాలి, వెళ్లి పోవాలి. అంతే."

"అలాగే లే, నీదగ్గిరికి రాడు; ముట్టుకోడు; ఏం?"

"..............."

"మా అమ్మే. మా తల్లే. నామాట తీసెయ్యవమ్మా నువ్వు! నిన్ను నాకొడుక్కంటే యెక్కువగా చూచుకుందును. మీ నాన్న నా కిలా తెచ్చిపెట్టాడు మువ్వు."

ఇలా చెబుతూ చిట్టెమ్మ వాకట్లోకి వచ్చాటప్పటికి సీతారామయ్య అప్పుడే నూతిదగ్గర నుంచి వచ్చి కాళ్లు తుడుచుకుంటూ సోఫామీద కూచుని వున్నాడు. అతన్ని చూడగానే నవ్వు రాగా, చిట్టెమ్మ దానిని చాలా ప్రయత్నం చేసి ఆపుకుని, "వోమాటు యింటోకి రా నాయనా నువ్వూ" అని చెబుతూ గది తలుపులు బారుగా తెరిచేసింది. సీతారామయ్య మంద హాసంతో గుమ్మం యెక్కేడు.

"ఆపిల్ల యెవర్రా నాయనా?"

"మొగం కనపడ్డం లేదు."

"వోమాటు యిలా తిరుగమ్మా."

"అక్కర్లే దక్క.ర్లేదు. అద్దంలో—ఆహా! పూర్ణ! ఎంత మంచి రోజూ నేడూ! అమ్మా! కళ్లున్నందుకు నేడు ఫలం కలిగింది. నాజన్మలో యిలాంటి ఆనందం యెప్పుడూ కలగలేదు."

"కళ్లు చల్లపడ్డాయిరా యివాళా."

"సందేహమా? అమ్మా! మన పాడు శాస్త్రాల వల్ల యిలాంటి తరుణీమణు లెందరు జీవచ్ఛవా లైపోతున్నారో చూశావా?"

"..............."

"మాట్లాడ వేమమ్మా? అంచేతే మన దేశం యింత పాడైపోయింది. నిరపరాధ లగు ఇలాంటి బాలికల ఉసురువల్లనే మన జాతి యింత దుర్బల మైపోయింది."

"ఈదండ వదినికి వెయ్యరా నాయనా."

చిట్టెమ్మ వొక దండ ఇవ్వగా పుచ్చుకుని సీతా



రామయ్య పూర్ణదగ్గిరికి వెళ్లాడు. సిగ్గుచేత పూర్ణ మొగం పక్కకి తిప్పుకోగా, "సిగ్గుపడకమ్మా! రోజూ చూసీ బావే కాదూ? బావ ఆదండ నీ మెడలో వేశాక ను

వ్వీదండ బావ మెడలో వెయ్యి. తప్పు లే దమ్మా! బిడియపడకు నా కూనా!" అని చిట్టెమ్మ ధైర్యం చెప్పి, పూర్ణని సరిగా నుంచోపెట్టింది. వెంటనే సీతారామయ్య బ్రహ్మానందంతో పూర్ణ మెడలో పూల దండ వేశాడు. చిట్టెమ్మ ప్రోత్సాహంచేత పూర్ణకూడా చాలా సిగ్గుపడుతూనే రెండో దండ సీతారామయ్య మెడలో వేసింది. ఆవేశా టప్పుడామె చిటికెన వేలు ఫాలతలమ్మీద తగలగా సీతారామయ్య పరవశు డైపోయాడు.

తరవాత "యిక నువ్వవతలికి వెళ్ళరా నాయనా" అని తల్లి చెప్పగా, కొడుకు "తలుపులు వేసెయ్యి నువ్వు" అంటూ పూలదండ బల్లమీద వుంచి, కోటు తీసేసి, బెత్తం పుచ్చుకుని షికారు వెళ్ళిపోయాడు. "నే నిప్పుడే వస్తా నుండవే అమ్మా" అంటూ చిట్టెమ్మ దొడ్డోకి వెళ్ళింది.

౧౦

జరిగిపోయినదాన్ని తలుచుకోగా పూర్ణకి పల్లమాలిన సిగ్గు వచ్చింది. వెంటనే ఆవేషం తీసేసుకోవాలని ఎడంచేతి గాజుల మీద కుడిచెయ్యి వేసుకుంది. కాని పైనుంచి యెవరో "యేం తప్పా?" అని అడిగి నట్లయింది. వెంటనే నిలువుటద్దం దగ్గిరికి వెళ్ళి చూసుకుని తన స్థానంలో మరెవర్తో వొక అందకత్తె నుంచుని వుందని బెదిరింది. నిదానించగా తానే; కలగాదు. ఆకళ్లు మునపటివే; గాని వాట్ల కిప్పు డపార మైన నూత్న తేజస్సు కలిగింది. ఆకపోలాలూ, ఆనుదురూకూడా మునపటివే; అయితే వాట్లమీద యిప్పు డంతం లేని నవలావణ్యం తొణికిపోయీలాగ ప్రవహిస్తోంది. పెదవులు కూడా మునపటివే; అయినా ముఖ్యంగా అధరోష్ఠం మీద యేదోనవీనతం కనబడింది. మునుపు వాడిపోయిన ట్లుండే చేతు లిప్పుడు నవనవలాడే తామరతూడుల్లాగ కనపడ్డాయి. ఆశరీరంకూడా మునపటిదే; గాని యిప్పుడది తవతవలాడే మాధవీలతలాగ ముద్దోస్తోంది. మునుపు దుఃఖభారంచేత కుంగిపోయి వుండే హృదయం యిప్పుడానందపారవశ్యంచేతా, వుత్సాహాతిశయంచేతా, భవిష్యజ్జీవితములో నూత్నపథాన్వేషణం ప్రారంభించింది.

పరికిణీలు కట్టుకునే సమయంలో మల్లుపంచెలామెమీద అమాంతంగా విరుచుకు పడిపోయాయి. శరీరం బాగా యెదగడమూ, బుద్ధి బాగా వికసించడమూ, మనస్సు ప్రాపంచికవృత్త పరిశీలనంలో మంచి చాతుర్యం సంపాదించడమూ ఆమెకి తరవాతనే జరిగాయి; కాని ఆతరవాత జరగవలసిన ముచ్చటలూ, వేడుకలూ, లాంఛనాలూ, మర్యాదలూ, గౌరవాలూ, సుఖానుభవాలూ-ఇలాంటి వన్నీ మాత్రం ఆమెకి మచ్చుకేనా దొరక్కుండానే పోయాయి. స్త్రీలకీ పురుషులకీ గూడా సంసారంలో వున్నంతసేపూ యేవేనా దుఃఖాలు వచ్చినా, అవి హద్దు కలవి కావడమూ, తరవాత మంచిమంచి సుఖాలు కలగడమూ, ఆ సుఖానుభవాలవల్ల పూర్వపు దుఃఖాలు పూర్తిగా మరుపు రావడమూ జరుగుతూనే వుంటాయి; కాని పూర్ణ సంగతి అలా కాలేదు. మల్లె తీగకి ఆకులు దూసెయ్యడమూ, మొగ్గలు తుంపెయ్యడమూ కాక మూలచ్ఛేదం యెలాంటిదో పూర్ణకి వైధవ్యం అలాంటి దయింది. ఆమెకి యేమీ యెరగని వయస్సులోనే యేమీ లేకుండా పోయింది. ఐహికవాంఛలమీద సహజమైన నిర్లిప్తత కలక్కుండానే ఆమె కవి సాంఘికదౌర్జన్యంవల్ల అంటరానివీ, కోరరానివీ, తలపరానివీ, చివరకి చూడరానివీ కూడా అయిపోయాయి. ఈవిధంగా ఆమె జీవితలతకి సహజపరిణతి కాక నిర్బంధప్రతిబంధకం యేర్పడిపోయింది.

ఇంతకీ చెప్పవచ్చిం దేమి టంటే: ఆమె వేషం లాగులూ, పరికిణీలూ, పైటపరికిణీలూ, పల్లెవాటులూ, చీరలూ, తరవాత—వయస్సు మళ్లేక—అంతానికీ—అప్పు డేనా క్వాచిత్కంగానూ, యేదో దురదృష్టం వల్లనూ మాత్రమే సైనుపంచెలూ—ఇలాంటి పరిణామాన్ని పొందక, పరికిణీలలోనుంచే సైను—మల్లుపంచెలలోకి దిగిపోయింది. అందుచేత పైటపరికిణీలూ, పల్లెవాటులూ, చీరలూ ధరించినపుడు తన రూపం యెలా వుండునో వూహ కేనా అందని విషయం అయిపోయి వుండగా, తరవాత తటస్థించిన దౌర్భాగ్యవేషం చాలా కాలాన్నుంచి అనుభూతమై, జీర్ణమై పోయి వుండగా,

యిక లేనే లేదనుకున్న యీహంగళవేషం ఆయాచితంగానూ, తలవని తలంపుగానూ, ఆకస్మికంగానూ, ఆశ్చర్యంగానూ, తటస్థించడంచేత నిలువుటద్దంలో మనోహర-దివ్య-సుఖమయ-హృదయోత్తేజక రూపం కనపడగా పూర్ణకి తాను తానేనా అనే సందేహం కలిగింది. అయితే యీసందేహం చివరి కామెకి మంచి ఫలాన్నే కలిగించింది. దేశానికీ, కాలానికీ, పాత్రకీ తగిన యీశోభనవేషం తీసేసుకొని తలచుకోడాని కూడా—రామరామా! మళ్లీ ఆబురదగుంటలో — ఆ అగ్నిగుండంలో వురకడం యేమిటీ?

ఆమె అద్దం యెదుట నిలువునా నుంచుని కళ్లు

చేరడేసి చేసుకుని తన వేషాన్నీ, రూపాన్నీ బాగా చూసుకుంది. ఓహో! ఎంత సుఖమూ! ఆమె వేషం ఆమెకే మోహజనకంగా వుంది. ఇందాకా చిట్టెమ్మా, సీతారామయ్యా చేసిన స్తుతిలో ఎంతయాథార్థ్యం వుందో ఆమె కిప్పుడు బోధపడింది. ఆమె తనకిట్టి ఆనందపారవశ్యాన్ని కలిగించిన మేనత్తయొక్క శుభచింతనాన్ని మెచ్చుకుని జన్మజన్మాలు పాదసేవ చేసినా ఆమెఋణం తీర్చుకోలేననీ, కనక అందుకు కృతజ్ఞతగా ఆమె చెప్పినట్లు నడుచుకోవాలనీ నిశ్చయించుకుంది.

సరిగా యీసమయంలో మళ్లీ చిట్టెమ్మ వచ్చింది. "ఏం చేస్తున్నావు కోడలా" అని ఆమె పిలవగా, "ఎందుకే అత్తా?" అని పూర్ణ గుమ్మంలోకి వచ్చి యెదురుగా నుంచుని అంతట్లో కొంచెం వెనక్కి తగ్గి, "వీధితలుపులు వేసే వున్నాయా?" అంది. చిట్టెమ్మకి కోడలు రూపం చూశాటప్పటికి బ్రహ్మానందమూ, ఆమె మాటలు వినగా నవ్వూ వచ్చాయి. "నేనే కాదుటే బావ షికారు వెళ్లాక తలుపులు బిడాయించి వచ్చానూ?" అని ఆమె అడిగింది.

"ఏమో బాబూ! ఎవ రేనా చూస్తే యింకేమేనా వుందా?"

"ఎవళ్ల సొమ్మేనా పట్టుకువచ్చామా యేమిటి మనం? ఎవళ్లేనా చూడడం మాత్రం యెందుకు వస్తుందీ?"

"నిజమే అత్తా. అదుటు అలా వుంది."

"కాదమ్మా మరీ? అయితేలే. పొద్దు పోయింది కదూ? మడి కట్టుకున్నాను. వంటింటో కూచుందువుగాని రా, పిచ్చాపాటీ చెప్పుకోవచ్చు."

"పద."

ఇలా చెప్పి పూర్ణ ఎడమచేతితో కుచ్చెళ్లు పట్టుకొని, వీధిగుమ్మంకేసి తిరిగితిరిగి చూస్తూ భీతహరిణం లాగ జడుస్తూ జడుస్తూనే చిట్టెమ్మతోకూడా వంటింటోకి వెళ్లి ఆమె ముక్కాలిపీట వెయ్యగా దానిమీద కూచుండి చిట్టెమ్మ వొక పొయ్యిమీద అన్నానికి యెసరు పెట్టి, దొండకాయలు తరగడానికి కత్తిపీటమీద కూచుంది.

కూర తరగడం అయిపోయే టప్పటికి సంధ్యారాగం బలిసింది. అది చూసి దీపాలు వెలిగించడానికి చిట్టెమ్మ లేవగా "నేను వెలిగిస్తాను, అగ్గిపెట్టి యివ్వవే అత్తా" అని పూర్ణ లేచింది. "నువ్వు కాదమ్మా! హాల్లోకి వీధి కిటికీలు తెరిచి వుంటాయి. దీపాలు నేను వెలిగిస్తాను;

గాని చీరలూ అవీ వాకట్లో మరిచే పోయాం. గదిలో పెద్దలాంపు వెలిగించి వాట్లని బీరువాలో సర్దుతావా? చూడూ; రాత్రి పడుకునేటప్పుడు నువ్వు కట్టుకోడానికి ఉప్పాడ చీరా, ఇమిటేషను సిల్కు రవికా తీసుకుని మరీ సర్దుసుమా తలిమ్మా నీ" అని చిట్టెమ్మ మళ్లీ అనగా, "అలాగే" అని పూర్ణ అగ్గిపెట్టె పుచ్చుకొని గదిలోకి వెళ్లింది. తలిమ్మా దీపాలు చిట్టెమ్మ వెలిగించేసి మళ్లీ వంటింటోకి రాగా పూర్ణ కూనిరాగం తీసుకుంటూ చీరలు సర్దడం మొదలుపెట్టింది.

౧౧

వంట అయిపోయింది. చిట్టెమ్మ చెప్పకుండానే లేచి వెళ్లి పూర్ణ వేషం మార్చేసి—అంటే వుప్పాడ చీరా, ఇమిటేషన్ సిల్కు రవికా తొడుక్కుని, నగలలో కాసులపేరూ, చంద్రహారమూ, పుస్తెలనానూ మట్టుకు తీసి మంచంమీద పెట్టివచ్చి, చిట్టెమ్మ సీతారామయ్యకోసం గంగాళంలోకి నీళ్ళు తోడేటప్పటికి పసిమ టిల్లు తుడిచి పీటలు పరిచింది.

"ఇనపపెట్టి తీసి వెండి గిన్ని తెచ్చుకోవే కోడలా!"

"ఈపూట బావ లేచి వెళ్లాక నువ్వూ నేనూ వొక్కమాటు కూచుందామే."

"ఇంకా నువ్వు వారంరోజు లుంటావు కదూ? తరవాత నాదగ్గిరే కూచుందువుగానిలే. ఈపూటకికూడా బావదగ్గిరేకూచో తల్లీ!"

"నేను కూచోలేను బాబూ బావదగ్గిరా. పోనీ నాకు వంటింటో వడ్డించు."

"తన అందం నీ అందానికి చాలింది కానప్పుడు నీదగ్గిర కూచోడానికి బావే సిగ్గుపడాలి; గాని నీ కేమీ? అయినా మధ్యాహ్నం వాడిబంతిని కూమని యిప్పుడు కూచోకపోతే నాతండ్రి మనస్సు యెలాగో అయిపోదూ?"

"ఏమో నమ్మా, నాకు భయం వేస్తోంది."

"పోనీ నిన్నిందాకా యేమేనా వెక్కిరించాడా బావా?"

"లేదు పాపం. అబద్ధా లెందుకూ?"

"ఇక నేమీ? ఇక భయం యెందుకూ?"

"..................."

"లేనిపోని మొగమాటాలు తెచ్చుకోకమ్మా. గిన్ని పట్టుకురా. చారు పుచ్చుకోడానికి దొన్నికూడా తెచ్చుకో. బావ వెండికంచం ఆఅలమరులో వుంది పీట దగ్గిర-అదేమే? నీకూ బావకీ మధ్యాహ్నంలాగే రెండు పీటలూ వరుసగా వేస్తే సిగ్గుపడతా వెందుకే నాతల్లీ?"

"..................."

"ముసలిదాన్ని చేసి నన్ను బుట్టలో పెట్టేద్దామని చూస్తున్నావా గడుసుపిల్లా? నన్నప్పుడే లోకువ చేసేశావుటే?"

"..................."

"తొరగా రాఅమ్మా! వెర్రిపిల్ల, వుబలాట మేగాని పెంకితనం యెరగదమ్మా చిన్నప్పణ్ణుంచీ గూడానూ."

నవ్వుకుంటూ వెళ్ళి పూర్ణ గిన్నీ, కంచమూ పీటల దగ్గిర పెట్టేటప్పటికి సీతారామయ్య వచ్చాడు. చిట్టెమ్మ తలుపు తియ్యడానికి వెళ్ళగా పూర్ణ వంటింటోకి చక్కాపోయి తలుపుచాటున నక్కింది. తరవాత సీతారామయ్య చొక్కాలు తీసేసి రంగుపంచె కట్టుకుని నూతిదగ్గిరికి వెళ్లి, "ఈపూట ఏం చేశావమ్మా?" అని అడుగుతూ పెరటిగుమ్మంలోనుంచి యాదాలాభంగా వంటింటోకి రాగా, పూర్ణ వొక్క అంగలో పడసు టింటోకీ, యింకో అంగలో మండువాలోకీ వురికింది. అది చూసి చిట్టెమ్మ "అదేమిటిరా నాయనా, దాన్నలా బెదరకొడతావూ?" అనగా, సీతారామయ్య "నేను చూడలే దమ్మా" అంటూ నూతిదగ్గిరికి వెళ్లిపోయి స్నానం మొదలుపెట్టాడు.

అతను తాపితా కట్టుకుని వచ్చి పీటమీద కూచునేటప్పటికి వడ్డన పూర్తి అయింది. ఇంకా పూర్ణ రాకపోవడంచేత పరిషేచన చెయ్యడాని కతను సందేహిం

చగా, చిట్టెమ్మ "వెళ్లి నువ్వు కూడా కూచోవే అమ్మా! బావ నీకోసం కనిపెట్టుకున్నాడు చూడూ" అంది. ఇలా మేనత్త రెండుమూడుమాట్లు చెప్పాక పూర్ణ యిక బాగుండదని వచ్చి కూచుంది. ఇద్దరూ వొక్కమాటే ప్రారంభించారు భోజనం. చిట్టెమ్మ వారికి నెయ్యి వడ్డించి వంటింటి గుమ్మంలో కూచుంది.

"నీ కేం కావాలే పూర్ణ?"

"............"

"నిన్నే ఓహోయ్! వదినా!"

"............"

మాట్లాడ వేమే బంగారబొమ్మా?"

"............"

"అయితే నీకూ నాకూ మాటలు పోయాయా యేమిటే?"

"............"

"అయితే నాకు సయించడం లేదే అమ్మా అన్నం. నేను లేచిపోతానే."

"చూశావా? బావని అన్నం తిననివ్వవుటే పూర్ణా?"

"నే నేం చేశానే?"

"నువ్వు మాట్లాడ్డం మానేస్తే బావ ప్రాణం కొట్టుకోదు తల్లీ?"

"............"

"ఈమాటు పిలవరా నాయనా"

"ఏమే వదినా?"

"ఎందుకూ?"

"ఏం కావాలే నీకూ?"

"కాస్త కూరా, కాస్త ఆవపిండీ వెయ్యవే అత్తా!"

"దొంగా! కడుపు కట్టిపెట్టుకుంటున్నావా?"

"నాకు పాపం తెచ్చిపెడతావుటే కోడలా?"

"కొంచెం కొంచెం వెయ్యాలి సుమా."

ఇలాగ వేళాకోళాలతో భోజనా లయినాక ఎవరో స్నేహితులు రాగా సీతారామయ్య హాలులోకి వెళ్లిపోయాడు. పూర్ణ మండువాలోకి వున్న హాలు తలుపులు మెల్లిగా బిగించి వచ్చి పాందాను తీసికొని వచ్చి పడమటింటో మేనత్త ఫలహారం చేస్తూ వుండగా యెదట కూచుని చిలుకలు చుట్టింది.

చిట్టెమ్మయిల్లు సద్దడం తొమ్మిదింటికి పూర్తయింది. చిలుకలు చుట్టడం అయిపోయిన తరవాత పూర్ణ ఆమెకి కొంచెం సాయం చేసింది. అప్పటికి సీతారామయ్య తన పని కూడా పూర్తిచేసుకుని, వీథితలుపులు పూర్తిగా బిగించి చూడగా హాలు తలుపులు వేసివున్నాయి. తను మొదట వొకటి రెండు మాట్లు తల్లిని పిలిచాడు; గాని జవాబు రాకపోగా తలుపు గుంజాడు. అది విని పూర్ణ మెల్లిగా పిల్లిలాగ వెళ్లి మునివేళ్లతో గొళ్లెం తీసి మెరుపులాగ పడమటింటోకి చక్కాపోయింది. సీతారామయ్య పూర్ణ సిగ్గు చూసి ఆనందిస్తూ గదిలోకి వెళ్లి గ్లాస్గో మల్లుపంచె కట్టుకుని, వాకట్లో మడతకుర్చీ మీదకూచుని ఏదో ఆలోచనలో పడ్డాడు. తరవాత మేనత్తతోకూడా పూర్ణ గదిలోకి వెళ్లింది.

లోపల యేవో గుసగుసలలాగ ధ్వని వినిపించింది. అది వుండివుండి వొకటిరెండుసార్లు వినిపించే టప్పటికి సీతారామయ్య మొగం వెనక్కి తిప్పుకుని చూడగా, వెండిపళ్లెంతో తాంబూలం పట్టుకు వచ్చి పూర్ణ సిగ్గుపడుతూ కుర్చీవెనక్కాల నుంచుని వుంది. వెంటనే అతను లేచి నుంచుని, "మాట్లాడకుండా అలా యెంతసేపు నుంచుంటావే పూర్ణా" అన్నాడు. అప్పుడు కూడా ఆమె మాట్లాడలేదు. "మాట్లాడవుటే పూర్ణా" అని అతను మళ్లీ అడిగినా మాట్లాడలేదు. అందు కతను "మాట్లాడ్డానికి పనికిరాని వాణ్ణి తాంబూలం యివ్వడానికి మాత్రం పనికివస్తానా యేమిటి? నా కక్కరే లేదు" అంటూ కొంచెం వెనక్కి తగ్గాడు.

పూర్ణ కేమో మాట్లాడకుండా వుండా లనే వుంది గాని యిక మేనత్త అందుకుంటుంది. యింకా అలాగే వుంటే సీతారామయ్యకి కష్టం తోస్తుం దని వకమూల భయంకూడా పుట్టింది. "వొరే బావా" అంటూ అస్తమానూ పాకులాడే తా నంతసిగ్గుపడడం

కూడా యేమి టని తోచింది మాట్లాడడానికే సిగ్గయితే అతని యెదట అంతసేపు నుంచోడంమాత్రం సిగ్గు కాదూ? ఇదంతా ఆలోచించుకుని ఆమె "ఇదిగో తాంబూలం" అంది. కానయితే ఆమాట చాలాదూరాన్నుంచి వినపడ్డం వీణాధ్వనిలాగే వుంది. అయినా సీతారామయ్య దానికే పొంగిపోయాడు. ఇంకా ఆలస్యం చేస్తే తను మోటతనం చేసిన ట్లవుతుం దని కూడా జంకా డతను. ఆభయముతో పూర్ణా, యీజంకుతో సీతారామయ్యా రాజీపడ్డారు. పళ్లెం జారిపోయిందా, పూర్ణ యిచ్చిందా అని సందేహం. కాని ఆమె చేతిలో వున్న పళ్లెం అతనిచేతిలో వుంది. చూడగా పూర్ణ గదిలో వుంది.

ఇదంతా చూసి బ్రహ్మానందపరవశు రా లవుతూ వున్న చిట్టెమ్మ వొక్క నిమిషం గడిచాక ముందుకు వచ్చి, "నువ్వెక్కడ పడుకుంటావురా నాయనా?" అని అడిగింది.

"పూర్ణో?"

"అదీ, నేనూ గదిలో పడుకుంటాం."

"అయితే నా కాంపుకాట్టు తెచ్చి యిక్కడ వెయ్యి."

"గాలి చాలుతుందా?"

"ఎలాగో బాధపడతా నివాళికి."

పూర్ణకి "మరి రేపో?" అని అని యెవరో అడిగిన ట్లయింది. దానిమీద యేదో మెరుపు తగిలినట్లు కూడా అయింది. వొళ్లు ఝల్లు మంది. వొక్క నిమిషం యిలా గడిచింది. అప్పుడు చిట్టెమ్మ యింటోకి రాగా పూర్ణ యెంతో మెల్లిగా "పోనీ మనం పడమటింటో పడుకుందా మే" అంది. కాని చిట్టెమ్మ అంగీకరించ లేదు. తరవాత కాంపుకా ట్టిద్దరూ విప్పి సాగతీసి సీతారామయ్య చెప్పిన చోట వేశారు. చిట్టెమ్మ పరుపు వేయగా పూర్ణ దుప్పట్టీ పరిచి,తలగడ పెట్టి, చిక్కగా మల్లి పువ్వులు చల్లి వెళ్లి పోయింది. తరవాత చిట్టెమ్మ గుమ్మంలోనూ, పూర్ణ కొంచెం తలుపు చాటునా కూచోగా, సీతారామయ్య కుర్చీ వారి కభిముఖంగా తిప్పుకున్నాడు.

౧౨

చిట్టెమ్మ గ్రామోఫోనుకేసి యాదాలాభంగా చూశాటప్పటికి దానిమీద అరవిచ్చిన పూలదండ కనపడింది. దానిమీద "అయ్యో! బావ దండ మరిచేపోయాడే. వేసిరా తల్లి" అని యామె చెప్పగా పూర్ణ వొకటి రెండు క్షణాలు గునిసిగునిసి వేసి వచ్చింది. తరవాత వారు కొంత సేపు ఆమాటా యీమాటా చెప్పుకున్నారు. గడియారం పదకొండు కొట్టింది. అప్పుడు పూర్ణకి ఆవలింతలమీద ఆవలింతలు రావడం చూసి చిట్టెమ్మ "నాయనా! పూర్ణకి నిద్ర వొస్తోం దిరా. ఇక పడుకుందాం లే" అంటూ లేచింది. "అవు నవును. పొద్దుపోయింది. పూర్ణని యివాళ చాలా కష్టపెట్టాం మనము. పడుకోండి" అని తన పక్కమీదకి వెళ్ళిపోయాడు. చిట్టెమ్మ "మిగిలిన పువ్వులు నీపక్కమీద—ఏమే? వొక్క పువ్వుకూడా లేకుండా చేసుకున్నావూ?" అనగా "నేను తెస్తున్నానుండవే అమ్మా" అంటూ తన పక్కమీది పువ్వులు సగంకంటె పైగా తెచ్చి సీతారామయ్య పందిరిమంచం మీద చల్లి చక్కాపోయాడు. అప్పుడు చిట్టెమ్మ "నాతండ్రి కన్నీ తెలుసును. నీపక్కమీద పువ్వులు లేకపోతే వాడు సహించగలడా? నాకొండా! నువ్వు చేసిన పనీ, నాతండ్రి చేసిన పనీగూడా బాగానే వున్నాయి. వెళ్లి పడుకోవే తల్లీ" అంటూ తన మామూలుచోప్పున జపానుచాప పరుచుకుని పడుకుంది. పూర్ణ ఆమెకి సమాధానం చెప్పకుండానే లోపల్లోపల నవ్వుకుంటూ లేచి గుక్కెడు మంచినీళ్లు తాగి, వసారాలోకి వున్న కిటికీరెక్కలు నాలుగూ బారుగా తెరిచేసి పడుకుంది.

వొంటిగంటకు హఠాత్తుగా మెళుకువ వచ్చి చిట్టెమ్మ లేచి చూడగా మంచుతెర వంటి వుప్పాడ చీర కట్టుకొని వున్న పూర్ణ వెన్నెలవంటి పాన్పుమీద బంగారుసలాకలాగ కదలకుండా పడుకుని వుంది. మూడు గంటలకి మళ్లీ మెళుకువ వచ్చి చూడగా పూర్ణ గోడవేపుకి తిరిగి పడుకునే వుండి వెక్కి వెక్కి దుఃఖిస్తోంది.

అది చూడగా చిట్టెమ్మ గుండె బేజారై పోయింది. ఆమె మనస్సు పరిపరి విధాలపోయింది. వాకట్లోకి తొంగి చూడగా సీతారామయ్య గాఢనిద్రలో వున్నాడు. ఆమె కారణాన్ని పోల్చుకో లేకా, యిక వుండలేకా, తటాలున లేచి వెళ్లి ఆమె పక్కలో కూచుని, "ఏం తల్లీ? ఏం మామ్మా?" అంటూ కంగారుపడుతూ అడిగింది. ఆమె యిలాగ రెండు మూడుమాట్లడిగే టప్పటికి పూర్ణ దుఃఖం కొంచెం సమాళించుకొని, లేచి కూచుంది. చిట్టెమ్మ మళ్లీ అడగ్గా అప్పుడు పూర్ణ "ఏమీ లేదూ. పూర్వపు సంగతు లన్నీ—ఇవాళ మధ్యాహ్నం దాకా నేను వేసిన పాడు వేషమూ, నే ననుభవించిన యమ యాతనా జ్ఞాపకం వచ్చి, హృదయాన్ని గొడ్డలి పెట్టుగా బద్దలుకొట్టేశాయి. దుఃఖాంధకారంలో సుఖానికల్లా నిగ్గయిన రోజులు—పదకొండేళ్లు వ్యర్థంగా గడిచిపోయాయి. పరాపాదిత మైన అలాంటి దారుణశిక్ష ననుభవిస్తూ నేను బతికి యెలా వుండగలిగానూ? అనే ఆవేదన కలిగి దుఃఖం వుబ్బెత్తుగా పొంగిపోయింది. ఎన్ని విధాల ప్రయత్నించినా అది తగ్గలేదు" అని చెప్పింది.

ఇది విని చిట్టెమ్మపెద్ద నిట్టూర్పు విడిచింది. సన్నసన్నంగా భాగ్యదేవత చెవిలో యేదో చెప్పినట్లయింది. ఆరాటపెడుతూ వున్న హృదయభారం తగ్గిపోయింది. అది విజయమో, భ్రాంతో-గర్వం మాత్రం కలిగింది. చిట్టెమ్మకి కంఠస్వరమే మారిపోయింది.

"తల్లీ! యింకెందుకూ? ఆపత్సముద్రం దాటి వొడ్డెక్కాక కూడా దుఃఖించడం యెందుకూ? నీకళ్లమ్మట నీళ్లు రావడం—దుఃఖోద్రేకంచేత నీపెదవులలా రావిరేకల్లాగ వొణికిపోవడం నేను చూడలేను. ఇక్కడ కాదు. వసారాలో కూచుందాం రా మాట్లాడుకోవచ్చు" నంటూ చిట్టెమ్మ ఆమెని లేవతీసుకుని బయలుదేరింది. ఇద్దరూ సోఫామీద కూచున్నారు. పూర్ణని తన వొడిలోకి తీసుకుని చిట్టెమ్మ లాలిస్తూ మాట్లాడింది—

"అమ్మా! నావుద్దేశమూ, బావ వుద్దేశమూ నువ్విదివరకే యెరుగుదువు. నీ వుద్దేశం కూడా స్పష్టంగానే వుంది. అయినా అవి వాగ్రూపంగా పైకి వచ్చి యేకం కాలేదు. నా కూనా! ఇం కెందుకూ దాపరికాలూ? నిన్ను నాకొడుక్కి—"

"బావకి నామీద దయ వుందా? నిజం చెప్పవె అత్తా! మోసం చెయ్యకు."

"మోసమా? బావ యిప్పుడు చక్రవర్తికూతురు-"

"ఎలా నమ్మనే? నిన్న భోజనం చేశా టప్పుడు—నువ్వు గూడా బందరుపిల్లమీద ఆశగా—"

"రామరామా! అప్పు డలా అనకపోతే యేమనమంటావు చెప్పూ? నీఅభిప్రాయం కొంచెమేనా—"

"నాలుగు రోజుల నాడు బావతో కాకినాడలో నేను స్పష్టంగానే—"

"అయితే బావ నిన్ను—"

"అలా చెప్పడానికీ వల్ల కాదూ. కొంచెం ఆశా వుంది. కానయితే అది నామనస్సుయొక్క దౌర్బల్యం.."

"నిజంగా అంతే. పోనీ బావచేత క్షమాపణ కోరిస్తా నుండూ."

"వొద్దువొద్దు. బావని నేను క్షమించడమా? అత్తా! ఇక నే నాపాడువేషం వెయ్యలేను. ఆనికృష్ట జీవనం గడపలేను. నా చూపు సంసారసుఖంమీదకి పోయింది. దాన్నిక తిప్పుకోలేను. నన్ను నీ కడుపులో పెట్టుకోవూ?"

"నువ్విలా అంటే నా కేడుపు వస్తోంది. మీ నాన్న నాకొడుకుని తోసేసి నిన్ను పైవాళ్ల కిచ్చినప్పుడు నే నెన్ని విధాల యెంతగా యేడ్చానో దేవుడికెరుక. తరవాత యింకేం లాభమూ?—"

"వారం రోజుల కిందటే నాకూ యేలూరుకీ రుణం చెల్లి పోయింది. మా అమ్మా, మావడినా నామీద చూపిస్తూవచ్చిన ప్రేమ జ్ఞాపకం వస్తే కొంచెం ఆశకనపడుతూనే వుంది. కాని నమ్మలేను. ఇక నాబతుకు బావ చేతిలోనూ, నీచేతిలోనూ వుంది. నన్ను కాపాడవుటే అత్తా?"

"వెర్రిదానా! కాళ్లు పట్టుకుంటున్నావా? కాస్త వోపికి పట్టావంటే ఇవాళ బావ నీకాళ్లే— తీసుకు వస్తానుండు."

"వొద్దు వొద్దు. రేపు—తెల్లవారేక—"

"నే నుండలే నమ్మా! నాయింటికి సాక్షాత్తూ లక్ష్మి వస్తూ వున్నప్పుడు—నాయనా!"

"నిద్ర చెరపకే, లేపకే పాపం!"

"తండ్రీ!—తీసుకు వస్తానుండు."

"నువ్వు లేచావంటే—మళ్ళీ పిలిచావంటే నన్ను చంపుకు తిన్నట్లే. ఇదిగో...కూచో. మాట్లాడకు. వొక్కమాట చెప్పు. నే నింక బతుకుమీద నిరాశ చేసుకో నక్కర లేదూ? నువ్వు రక్షిస్తావా?"

"అయ్యో! ఇంకా సందేహం యెందుకే తల్లీ! నిన్న మధ్యాహ్నం భోజనాలవేళ దగ్గిర్నుంచి నీకోసం అటమటించి పోతున్నాను నేను. నాతండ్రికి మనస్సులోనే లేదూ. ఇప్పటి కేనా నువ్వు నాకోడలివై నందుకు—ఇంతకీ యిప్పటి కీవిధంగా వుంది యోగం.

ఇక వారు పడుకో లేదు. ఇలాగే మాటలతోటే మిగిలివున్న ఆకాస్త రాత్రీ కడిచిపోయింది. ఉషఃకాంతిలో అరవిచ్చివున్న గులాబీమొగ్గలూ, వెన్నముద్దల్లాగ విప్పారివున్న నందివర్ధనం పువ్వులూ, విరజిమ్మినట్లు నేలమీద రాలివున్న పారిజాతపుష్పాలూ పూర్ణకి స్వాగతం యివ్వగా వాట్లమీద మూగుతూ వున్న కొదమతుమ్మెదలు భవిష్యజ్జీవితం యొక్క ఆనందమయవిలాసాలిని గానం చేశాయి.

మందువాలోనుంచి దూసుకు వచ్చి ప్రభాతవాయువు మేలుకొలపగా సీతారామయ్య అప్పుడే లేచి కూచున్నాడు. చిట్టెమ్మ గాలిలో దూదిపింజలాగ యెగిరి వచ్చి, "నాయనా! నీదే తరవాయి. నిమిషాల మీద అయిపోవాలి పెళ్ళి" అంది.

హృదయార్పణము

తన్నీరు కృష్ణమూర్తిగారు

పాండులోకంబుపైన నిష్ఫలముగాను
రిక్తహస్తుండనౌచు వ్రాలితిని దేవ!
దేని నర్పించి మిమ్ము ప్రార్థింతు నిపుడు
అన్నవస్త్రంబులే కఱవయ్యె నాకు!

యేడుపులతోడ వత్సరా లెగిరిపోయె
చూతుమన్నను నెత్తురుచుక్క లేక
జీవములతోడ శల్యావశిష్టుడనయి
నిలచియున్నాడ; నన్ను గాంచితివో? లేదో?

కటికకటవులలోన ముక్కలయిపోయి
అహరహంబులు క్షుత్ బాధ కాగలేక
అవయవంబులు రక్తంబు నపహరింప;
రంధ్రములతోడ నిదిగో డొల్లయయిపోయి;

ఈక్షణమొ; ఆక్షణంబునో; యెగిరిపోవు
హృదయమున్నది; దాని నందించుచుంటి
స్వామి! గైకొమ్ము నా మనశ్శాంతికొఱకు.